PRGI RNI : TGTEL/25/A5065

vaartha sandhya

వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు

vaarthasadhya@gmail.com

epaper.vaarthasadhya.com

విలేకరులు కావలెను!

మా వార్త సంధ్య పత్రిక మరియు CM NEWS TV టీవీ కోసం

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

హైదరాబాద్ & అమరావతి

మరియు జిల్లాల వ్యాప్తంగా కావలెను.

CM NEWS For The People

విద్య, వైద్య, ఆరోగ్య, సామాజిక,
రాజకీయ మరియు ప్రజా సమస్యలపై
పరిశోధనాత్మక వార్తల సేకరణ కొరకు
జిల్లా స్థాయి విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి

7396122101 vaarthasadhya@gmail.com

9951751662 epaper.vaarthasadhya.com

13-22/42, Plot No.253, VV Nagar Colony, Gaddiannaram, Ranga Reddy Dist. - Hyderabad, Telangana 500060

Published From : Rangareddy VOLUME : 01 Issue : 266 Thursday 17-09-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal--Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet



నేడే తెలంగాణ విమోచన దినోత్సవం

- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్స్‌లో వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఉపరాష్ట్రపతి సీపీ.రాధాకృష్ణన్
- పటేల్ సంకల్పంతోనే తెలంగాణ భారత యూనియన్‌లో విలీనం
- నిజాం మెడలు వంచిన ఘనత ఉక్కుమనిషిదే: ఎన్.రాంచందర్‌రావు
- పరేడ్ గ్రౌండ్స్‌లో ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభం

హైదరాబాద్,

: తెలంగాణ చరిత్రలో కీలక ఘట్టమైన సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని గురువారం తెలంగాణ విమోచన దినోత్సవం ఘనంగా జరగనుంది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి భారత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ తదితరులు బీజేపీ ఎంపీలు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు కూడా వేడుకల్లో పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగే ఈ కార్యక్రమానికి కేంద్ర సాంస్కృతిక శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. వేడుకల్లో తెలంగాణ చరిత్ర, సంప్రదాయ కళలు, ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించేలా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. -మిగతా 2 లో

టీ కాంగ్రెస్‌కు కొత్త ఇన్చార్జి!

రేపు ప్రకటన వెలువడే ఛాన్స్

- లండన్‌కు మీనాక్షి నటరాజన్
- ఢిల్లీకి పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్
- సంస్థాగత మార్పులపై కీలక చర్చలు
- కొత్త ఇన్చార్జి ఎంపికపై ఉత్కంఠ
- కాంగ్రెస్‌లో మారనున్న సమీకరణాలు
- ముందున్న మూడు ప్రధాన సవాళ్లు



హైదరాబాద్,

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జిగా ఉన్న మీనాక్షి నటరాజన్ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో ఆమె స్థానంలో ఎవరిని నియమించాలన్న దానిపై అధిష్టానం కసరత్తు తుది దశకు చేరినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈనెల 18న కొత్త ఇన్చార్జి పేరును ప్రకటించే అవకాశం ఉందన్న ప్రచారం సాగుతోంది. మీనాక్షి నటరాజన్ లండన్‌లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్తున్నారు. దాదాపు పది నెలలు ఆమె అక్కడే ఉంటారు. సెప్టెంబర్ 21న లండన్ వెళ్లనున్నట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో.. మహేష్‌కుమార్ గౌడ్ ఢిల్లీ బాట పట్టడం రాజకీయ -మిగతా 2 లో



పాస్‌పోర్ట్ ర్యాంకులో భారత్‌కు షాక్

- 73వ స్థానానికి పడిపోయిన భారత్
- ఏడాదిలో ఏడు స్థానాలు దిగజారిన వైనం
- టాప్‌లో యూఏఈ పాస్‌పోర్ట్
- 69కు పడిపోయిన మొబిలిటీ స్కోర్
- 25 దేశాలకు వీసా ఫ్రీ ప్రయాణం
- 129 దేశాలకు ముందస్తు వీసా తప్పనిసరి
- ర్యాంకింగ్స్‌పై కేంద్రం అభ్యంతరం



భారత్‌పై అమెరికా 100 శాతం సుంకం?

- రష్యా ఆంక్షల బిల్లుతో భారత్‌కు ముప్పు
- తుది ఓటింగ్‌కు అమెరికా ప్రతినిధుల సభ
- 241--211 ఓట్లతో బిల్లుకు ఆమోదం
- సెనేట్‌లో ఇప్పటికే ఆమోదం
- ట్రంప్‌కు పెరగనున్న సుంకాల అధికారం
- ఇద్దరు డెమోక్రాట్ల మద్దతు
- బిల్లు ఆమోదిస్తే ట్రంప్ ముందుకు

భారత నిఘా నౌకను ఢీకొట్టిన పాక్ యుద్ధనౌక


- అసురక్షితంగా దిశ మార్చడంతోనే ఘటన
- పాక్ దౌత్యాధికారికి సమన్లు
- పునరావృతం కాకుండా హెచ్చరిక
- 1991 ఒప్పందానికి విరుద్ధమన్న భారత్
- 2011లోనూ ఇలాంటి ఘటనే
- పాక్ నౌక తీరుపై తీవ్ర అభ్యంతరం



కేసీఆర్ భూదోపిడీపై విచారణ

రూ. లక్ష కోట్ల విలువైన భూమిని దోచారు

- ఆయన కుటుంబ ఆధీనంలో 440 ఎకరాలు
- విదేశీ ముఠాకు ధరణి పోర్టల్ ఇచ్చారు
- నిగ్గు తేల్చేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- 30 రోజుల్లో అధికారులు నివేదిక ఇవ్వాలి
- సత్యం రామలింగరాజు భూమి కేటీఆర్‌కు ఎలా బదిలీ అయ్యింది?
- రంగనాయక సాగర్‌లో హరీశ్‌రావు ఫామ్‌హౌస్ అక్రమమే
- మైహోం కంపెనీకి 2,300 ఎకరాలు ఎలా ఇచ్చారు?
- 22-Aలో 98,37,320 ఎకరాలు ఉండాల్సిందే
- లేకుంటే వాటికి రక్షణ ఉండదు : శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



-హైదరాబాద్

ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు రూ. లక్ష కోట్ల భూదోపిడీకి పాల్పడ్డారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వ భూములు, వక్ఫ్, దేవాదాయ, ఫారెస్టు, అసైన్డ్, ఇనాం, వివాదాల్లోని భూములు.... ఇలా కల్వకుంట్ల కుటుంబం వేటినీ వదిలిపెట్టలేదన్నారు. బుధవారం శాసనసభలో 22-ఏపై జరిగిన స్వల్పకాలిక చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. భూ రక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలను ఉల్లంఘించి, భూములను కొల్లాగొట్టారని చెప్పారు. మొత్తంగా కల్వకుంట్ల కుటుంబం 440 ఎకరాల భూమిని ఆక్రమించిందన్నారు. అంత భూమి ఎలా వచ్చిందో కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. చట్టాలను విధ్వంసం చేసి, పేదల భూములను లాక్కున్నారని చెప్పారు. -మిగతా 2 లో




రాబోయే మూడు రోజులు వర్షాలు!

- ద్రోణి ప్రభావంతో భారీ వర్షాలు
- మూడు జిల్లాలకు ఎల్లో అలర్ట్
- 19న ములుగు, భద్రాద్రి, ఖమ్మంలో భారీ వానలు
- రాష్ట్రంలో 19 శాతం లోటు వర్షపాతం
- ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో అధిక లోటు
- మిర్యాలగూడలో 4.17 సెం.మీ. వర్షపాతం

హైదరాబాద్,

ఆవర్తన ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. 19న ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.మరోవైపు ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రంలో 19 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అధిక లోటు వర్షపాతం నెలకొన్నది. గడిచిన 24 గంటల్లో పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో అధికంగా 4.17 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.



లింగ సమానత్వంలో భారత్‌కు 131వ ర్యాంక్

- వరుసగా 16వసారి ఐస్‌లాండ్ టాప్
- 145 దేశాలపై డబ్ల్యూఈఎఫ్ నివేదిక
- ఆర్థిక రంగంలో 41.2 శాతం ప్యారిటీ
- రాజకీయ సాధికారతలో తగ్గిన స్కోర్
- మంత్రి పదవుల్లో మహిళలు 5.9 శాతమే
- సమానత్వానికి మరో 120 ఏళ్లు
- సీఈఓ పదవుల్లో 19.1 శాతమే మహిళలు

సౌదీపై హౌతీల దాడులు


- చమురు కేంద్రం, వైమానిక స్థావరాలు లక్ష్యం
- క్షిపణులు, డ్రోన్లతో విధ్వంస వ్యూహం
- మక్కా సమీపంలో డ్రోన్ కలకలం
- కూల్చివేసిన సౌదీ సంకీర్ణ దళాలు
- 'రెడ్ లైన్' దాటితే తీవ్ర చర్యలు: సౌదీ హెచ్చరిక
- దాడుల్ని ఖండించిన భారత్

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. సౌదీ అరేబియాలోని కీలక సైనిక స్థావరాలు, చమురు మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని హౌతీలు క్షిపణులు, డ్రోన్లతో దాడులకు పాల్పడుతున్నట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు వెల్లడించాయి. తాజాగా మక్కా సమీపంలోకి దూసుకొచ్చిన డ్రోన్ను కూల్చివేసినట్లు ప్రకటించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. పవిత్ర ప్రాంతాలు, యాత్రికుల భద్రత తమకు 'రెడ్ లైన్' అని సౌదీ హెచ్చరించింది. మరోవైపు మక్కాను లక్ష్యంగా చేసుకున్నామన్న ఆరోపణలను హౌతీలు ఖండించారు. ఈ పరిణామాలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. సౌదీ భూభాగం, పౌరులు, కీలక మౌలిక వసతులపై దాడులు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. ఎర్ర సముద్రం--బాబ్ అల్ మండెబ్ జలసంధిలో నౌకాయాన భద్రతపై కూడా ఆందోళనలు పెరుగుతున్నాయి.



vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com

లింగ సమానత్వంలో భారత్‌కు 131వ ర్యాంక్



ఢిల్లీ: స్త్రీ, పురుష సమానత్వం విషయంలో భారత్ 131వ స్థానంలో నిలిచింది. గతేడాది ఉన్న ర్యాంకునే మళ్లీ ఇండియా నిలుపుకుంది. లింగ సమానత్వంలో వరుసగా 16వ సారి తొలి స్థానంలో ఐస్‌లాండ్ నిలిచింది. ఫిన్లాండ్, నార్వే, నమీబియా, యూకే టాప్-5లో నిలిచాయి. 148 దేశాల్లో లింగ సమానత్వ స్థితిగతుల సమాచారంతో 'గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్ 2026'ను వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) బుధవారం రిలీజ్ చేసింది. 145 దేశాలున్న ఈ సూచికలో భారత్ కంటే దిగువన కేవలం పపువా న్యూ గినియా, కువైట్, ఒమన్, ఖతార్, తజికిస్తాన్, సౌదీ అరేబియా, ఈజిప్ట్, మొరాకో, మాలి, అల్జీరియా, కాంగో వంటి 14 దేశాలు ఉన్నాయి. డబ్ల్యూఈఎఫ్ విడుదల చేసిన సూచికలో చాద్ అత్యల్ప ర్యాంకు (145)లో నిలిచింది. ఇరాన్ (144), పాకిస్తాన్ (143) ర్యాంకులతో అట్టడుగు జాబితాలో నిలిచాయి.

2006 నుంచి ఇప్పటి వరకు భారత్‌లో లింగ సమానత్వం 4.3 శాతం పాయింట్లు పెరిగింది. ఆర్థిక భాగస్వామ్యం, ఉపాధి అవకాశాల్లో భారత్ 41.2 శాతం ప్యారిటీ స్కోర్‌ను నమోదు చేసింది. వృత్తి, సాంకేతిక రంగ కార్మికులు సాధించిన బలమైన పురోగతి కారణంగా ఆయా రంగాల్లో దేశంలో ప్యారిటీ స్కోర్ 2006లో 26.6 శాతం ఉండగా, 2026 నాటికి అది 49.9 శాతానికి చేరింది. రాజకీయ సాధికారత విభాగంలో మునుపటి ఏడాది కంటే 0.7 పాయింట్లు మేర తగ్గింది. భారత ప్రభుత్వంలోని మంత్రి పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం 2006లో 2.4 శాతం ఉండగా, అది 2026 నాటికి 5.9 శాతానికి పెరిగింది. 2019లో ఈ విభాగంలో భారత్ అత్యధికంగా 30 శాతం ప్యారిటీ స్కోర్‌ను నమోదు చేసింది.

సమానత్వానికి 120 ఏళ్లు పడుతుంది..

పూర్తి లింగ సమానత్వం సాధించడానికి ఇంకా 120 ఏళ్లు పడుతుందని అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా లింగ అంతరం ఇప్పుడు 69.2 శాతానికి తగ్గిందని, ఇది గతేడాదితో పోలిస్తే 0.4 శాతం పాయింట్లు ఎక్కువని అభిప్రాయపడింది. ఏదైనా కంపెనీ లేదా సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పదవుల్లో మహిళలు 19.1 శాతం మాత్రమే ఉన్నారని చెప్పింది. మహిళలు నిర్వహిస్తున్న ప్రతి 10 మంత్రిత్వ శాఖలలో కేవలం ఒకటి మాత్రమే సరైనదని పేర్కొంది.

భారత నిఘా నౌకను ఢీకొట్టిన పాక్ యుద్ధనౌక

- ఘటనపై విదేశాంగశాఖ ఆగ్రహం
- ఇస్లామాబాద్ దౌత్యవేత్తకు సమన్లు
- పాక్ హైకమిషన్ ఎదుట నిరసన



ఢిల్లీ: అరేబియా సముద్రంలో నావికాదళం దుందుడుకు చర్యకు పాల్పడింది. పాకిస్తాన్ యుద్ధనౌక ఒకటి వేగంగా వచ్చి భారత నిఘా నౌకను ఢీకొంది. ఈ ఘటనపై పాక్ దౌత్యాధికారికి భారత్ సమన్లు జారీ చేసింది. పాక్ నేవీని అదుపులో పెట్టుకోవాలని పాక్‌కు భారత విదేశాంగశాఖ గట్టి హెచ్చరికలు చేసింది. సెప్టెంబర్ 15 సాయంత్రం ఉత్తర అరేబియా సముద్రంలో ఈ ఘటన జరిగింది. భారత నౌకాదళానికి చెందిన ఓ ఫ్రంట్‌లైన్ యుద్ధనౌక సాధారణ నిఘా కార్యకలాపాల్లో భాగంగా సముద్రంలో పర్యటిస్తుండగా, పాకిస్తాన్ నౌకాదళానికి చెందిన ఓ నౌక దాని వైపు వచ్చినట్లు తెలుస్తోంది. పాక్ నౌక అధిక వేగంతో భారత నౌకకు సమీపంగా వచ్చి, అసురక్షితంగా, వృత్తిపరమైన ప్రమాణాలకు విరుద్ధంగా దిశ మార్చుకోవడంతో రెండు నౌకలు ఢీకొన్నట్లు భారత వర్గాలు తెలిపాయి. అయితే ఈ ఘటనలో భారతీయ నావికాదళ సిబ్బందికి గానీ, యుద్ధనౌకకుగానీ ఎటువంటి ఆస్తి లేదా ప్రాణ నష్టం జరగలేదని ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ బాధ్యతారాహిత్య చర్యను భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తీవ్రంగా పరిగణించింది. పాక్ దౌత్యాధికారికి సమన్లు జారీ చేసి గట్టిగా మందలించింది. ఈ సంఘటన 1991 నాటి సైనిక విన్యాసాలు, కదలికలకు ముందస్తు సమాచారం ఇచ్చే ఒప్పందానికి విరుద్ధంగా ఉందని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాకిస్తాన్‌లోని సంబంధిత అధికారులకు ఈ విషయాన్ని తెలియజేయాలని కోరింది. కాగా, 2011లో పాక్ నేవీకి చెందిన బాబర్, ఐఎన్ఎస్ గోదావరి మధ్య ఇలాంటి ఘటనే జరిగింది. ఆ సమయంలో సముద్రపు దొంగల చెర నుంచి విడుదలైన ఎంబీ సూయజ్ అనే సరకు నౌకకు పాకిస్తాన్ నౌకాదళానికి చెందిన పిఎన్ఎస్ బాబర్ రక్షణ కల్పిస్తోంది.

భారత్‌పై అమెరికా 100 శాతం సుంకం?

-రష్యా ఆంక్షల బిల్లుతో భారత్‌కు ముప్పు
-241--211 ఓట్లతో బిల్లుకు ఆమోదం
-సెనేట్‌లో ఇప్పటికే ఆమోదం
-ట్రంప్‌కు పెరగనున్న సుంకాల అధికారం
-ఇద్దరు డెమోక్రాట్ల మద్దతు
-బిల్లు ఆమోదిస్తే ట్రంప్ ముందుకు



వాషింగ్టన్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై గరిష్ఠంగా 100 శాతం వరకు సుంకాలు విధించేందుకు చట్టపరమైన మార్గం త్వరలో ఏర్పడే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన రష్యా ఆంక్షల బిల్లుపై అమెరికా ప్రతినిధుల సభలో బుధవారం మధ్యాహ్నం తుది ఓటింగ్ జరగనుంది. బిల్లు ఆమోదం పొందితే అధ్యక్షుడి ఆమోదానికి పంపిస్తారు.మంగళవారం సాయంత్రం ప్రతినిధుల సభలో బిల్లు విధానపరమైన అడ్డంకిని అధిగమించింది. ఇద్దరు డెమోక్రాట్లు తమ పార్టీ నిర్ణయానికి భిన్నంగా రిపబ్లికన్లతో కలసి బిల్లుకు అనుకూలంగా ఓటు వేశారు. దీంతో తీర్మానం 241-211 ఓట్లతో ఆమోదం పొందింది. సెనేట్ ఇప్పటికే దీన్ని ఆమోదించింది.ం

పాస్‌పోర్ట్ ర్యాంకులో భారత్‌కు షాక్

ఢిల్లీ:

ప్రపంచ దేశాల పాస్‌పోర్ట్‌ల శక్తిని అంచనా వేసే 'పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2026' లో భారత్ స్థానం పడిపోయింది. ఈ తాజా గ్లోబల్ ర్యాంకింగ్స్ లో భారత పాస్‌పోర్ట్ 73వ స్థానంలో నిలిచింది. 2025లో 66వ స్థానంలో ఉన్న భారత్.. ఈ ఏడాది ఏకంగా ఏడు స్థానాలు దిగజారింది. ఇదే సమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పాస్‌పోర్ట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్ట్ అత్యంత బలహీనమైనదిగా జాబితాలో చిట్టచివరన నిలిచింది. 'ఆర్టన్ క్యాపిటల్' సంస్థ ఈ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌ను రూపొందిస్తున్నది. వీసా లేకుండా (వీసా-ఫ్రీ), వీసా ఆన్ అరైవల్ సౌకర్యాలున్న దేశాల సంఖ్య ఆధారంగా 'మొబిలిటీ స్కోర్' (ఎంఎస్) కేటాయిస్తారు. ఈ స్కోర్ ఎంత ఎక్కువగా ఉంటే ఆ పాస్‌పోర్ట్ అంత శక్తిమంతమైనదని అర్థం. మొత్తం 199 దేశాల పాస్‌పోర్ట్‌లను ఈ ర్యాంకింగ్ కోసం విశ్లేషించారు. ప్రస్తుతం భారత్ మొబిలిటీ స్కోర్ 69గా ఉంది. ఈ స్కోర్‌తో భారత్.. జింబాబ్వే, ఉగాండా, ఉజ్బెకిస్థాన్, సావో టోమ్ అండ్ ప్రిన్సిపీ, వియత్నాం వంటి దేశాలతో కలిసి 73వ స్థానాన్ని పంచుకుంటోంది. భారత పాస్‌పోర్ట్ ఉన్నవారు 25 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. మరో 39 దేశాల్లో వీసా-ఆన్-అరైవల్ సౌకర్యం ఉంది. అయితే 129 దేశాలకు వెళ్లాలంటే ముందస్తుగా వీసా తప్పనిసరి. గత ఏడాదితో పోలిస్తే వీసా ఆన్ అరైవల్ దేశాల సంఖ్య తగ్గడంతో మొబిలిటీ స్కోర్ 73 నుంచి 69 కి పడిపోయింది. ఇదే ర్యాంకు పతనానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ జాబితాలో యూఏఈ పాస్‌పోర్ట్ 181 మొబిలిటీ స్కోర్‌తో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానంలో నిలిచింది. యూఏఈ పౌరులు 138 దేశాలకు వీసా లేకుండా, 43 దేశాలకు వీసా-ఆన్-అరైవల్‌తో ప్రయాణించవచ్చు. కేవలం 17 దేశాలకు మాత్రమే వారికి వీసా అవసరం. ఇక ఈ జాబితాలో ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్ట్ అత్యంత బలహీనమైనదిగా 99వ ర్యాంకులో ఉంది. దాని మొబిలిటీ స్కోర్ కేవలం 35 మాత్రమే. ఆఫ్ఘన్ పౌరులు ఏకంగా 163 దేశాలకు కచ్చితంగా వీసా తీసుకోవాల్సిందే. అయితే ఇలాంటి గ్లోబల్ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్‌లను భారత ప్రభుత్వం అంగీకరించడం లేదు. కొన్ని ప్రైవేట్ సంస్థలు ఏకపక్షంగా నిర్ణయించిన పారామీటర్ల ఆధారంగా ఈ నివేదికలను రూపొందిస్తున్నాయని కేంద్రం భావిస్తోంది. దీనిపై విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ గత జూలై 31న లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. "పాస్‌పోర్ట్‌లకు ర్యాంకులు ఇవ్వడానికి ప్రపంచవ్యాప్తంగా ఆమోదయోగ్యమైన ప్రమాణాలు లేవు. అందుకే ఏ ర్యాంకింగ్ వ్యవస్థను ప్రామాణికంగా తీసుకోలేం" అని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

కేసీఆర్ భూదోపిడీపై విచారణ

(మొదటి తరువాయి)

ఈ వ్యవహారంపై ప్రత్యేక విచారణ బృందం(ఎస్ఈటీ) ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ బృందం కేసీఆర్ కుటుంబంతో పాటు ధరణి అక్రమాలపై 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భూములపై కోర్టు కేసులు, వివాదాలతో కొంత ఆలస్యమైనా కేసీఆర్ భూదోపిడీని నిగ్గుతేలుస్తామన్నారు. భూ దోపిడీకి పాల్పడిన ఆ కుటుంబం జైలుకుపోక తప్పదని హెచ్చరించారు. కేసీఆర్ బినామీ బోయినపల్లి శ్రీనివాసరావు వట్టినాగులపల్లిలో ప్రభుత్వ భూమికి సేల్ డీడ్ చేసినట్టు బహిర్గతమైందని చెప్పారు. భూపాలపల్లిలో గంద్ర వెంకటరమణారెడ్డి పార్టీ ఫిరాయించినందుకు ఆయన పేరిట 106 ఎకరాల ఫారెస్ట్ భూమిని పట్టాగా మార్చారని తెలిపారు. అటవీ శాఖ అధికారులు కోర్టుకు పోతే ఆ భూమి ప్రయివేటు భూమి అంటూ కలెక్టర్ నివేదించారంటే, కేసీఆర్ కుటుంబం ఏ రకంగా భూ విధ్వంసానికి పాల్పడిందో అర్థమవుతోందన్నారు. బహదూర్‌గూడలో 77 ఎకరాల భూములు ఎలా అన్యాక్రాంతమయ్యాయో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి లేఖ రాయాలని సూచించారు. ఓ పత్రిక ఎమ్‌డీకి బెంజ్‌కార్లు ఎలా వచ్చాయో, అందుకు ప్రతిఫలంగా గోల్డ్



స్టోన్ ప్రసాద్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మేలు ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు.

ధరణి అడ్డం పెట్టుకుని... భూదాన్ భూముల పట్టా

ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని భూదాన్ భూములకు ఇబ్బడి ముబ్బడిగా పట్టాలు ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. సిరిసిల్లలో ఎనిమిదివేల ఎకరాల అసైన్డ్ భూములు బదలాయించారని తెలిపారు. సందీప్ ఝూను కలెక్టర్‌గా వేస్తే రెండువేల ఎకరాలను బయటకు తీశారని తెలిపారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు చుట్టు పక్కల మైహోం రామేశ్వర రావుకు 2,647 ఎకరాల భూమి కట్టబెట్టారన్నారు. ప్రజల సొమ్మును ఇష్టం వచ్చినట్టు కొల్లగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేళ్ల చెరువులో ధరణి ద్వారా భూదాన భూమికి పట్టా ఇచ్చారని ఆధారాలను బహిర్గతం చేశారు.

మైహోం కంపెనీకి 113 ఎకరాలు సిమెంట్ ఫ్యాక్టరీ కి వాడుకుంటున్నారని తెలిపారు. అసైన్డ్ భూములు... వక్ఫ్ భూములన్నీ మై హోమ్ వాళ్ళు లాక్కోవచ్చా? అని నిలదీశారు. భూములు ఎక్కడ కనిపించినా గద్దల లెక్క వాలిపోయారని విమర్శించారు. ఈ చర్చ రాకుండా ఉండాలనే సభలో గందరగోళం చేయాలని చూశారని తెలిపారు. ఆడబిడ్డలను అడ్డంపెట్టుకుని అడ్డుకోవాలి అనుకున్నారని చెప్పారు. శిశుపాలునికి కూడా వంద తప్పులు చేస్తేనే శిక్ష పడిందని గుర్తుచేశారు. ఏ రాక్షసుడికైనా సమయం వస్తుంది... అప్పుడే శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. 22ఎ ను అడ్డంపెట్టుకుని తమపై నిందలు వేయాలని చూశారని తెలిపారు. సంగారెడ్డి లో భూముల చిట్టా కూడా బయట పెడతానన్నారు. ఇలాంటి వాళ్లను మనం క్షమిస్తే.. మనల్ని భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు.

సౌదీపై హౌతీల దాడులు

- చమురు కేంద్రం, వైమానిక స్థావరాలు లక్ష్యం
- క్షిపణులు, డ్రోన్లతో విధ్వంస వ్యూహం
- మక్కా సమీపంలో డ్రోన్ కలకలం
- కూల్చివేసిన సౌదీ సంకీర్ణ దళాలు
- 'రెడ్ లైన్' దాటితే తీవ్ర చర్యలు: సౌదీ హెచ్చరిక
- దాడుల్ని ఖండించిన భారత్

రియాద్:

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాలుస్తున్నాయి. సౌదీ లక్ష్యంగా హౌతీ తిరుగుబాటు దారులు విస్తృత దాడులకు తెగబడుతున్నారు. సౌదీ అరేబియాలోని కీలక సైనిక, చమురు మౌలిక సదుపాయాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తున్నారు. తాజాగా, ఇస్లాం పవిత్ర నగరం మక్కాను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడికి ప్రయత్నించారని సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ఆరోపించాయి. ఈ ఆరోపణలపై ముస్లిం ప్రపంచంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుండగా, పవిత్ర స్థలాల భద్రత తమకు 'రెడ్ లైన్' అని సౌదీ స్పష్టం చేసింది. మక్కా వైపు వస్తున్న డ్రోన్ను కూల్చివేశామని సౌదీ తెలిపింది. సంకీర్ణ దళాల కమాండ్ మాత్రం హౌతీలకు తీవ్ర హెచ్చరిక చేసింది. మక్కా, మదీనా పవిత్ర మసీదులు. వాటిని సందర్శించే యాత్రికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపింది. అవసరమైన, నిరోధక చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని పేర్కొంది. 57 ముస్లిం దేశాల సమాఖ్య అయిన ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్



కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. అయితే ఈ ఆరోపణలను హౌతీలు తీవ్రంగా ఖండించారు. మక్కాను లక్ష్యంగా చేసుకుంటున్నారన్న సౌదీ ప్రకటన పూర్తిగా అబద్ధమని హౌతీ రాజకీయ విభాగం సభ్యుడు హజెమ్ అల్-అసద్ పేర్కొన్నారు. గతంలోనూ ఇలాంటి ఆరోపణాలు చేశారని, ఇప్పుడు కూడా అవి ప్రజలను మోసం చేయలేవని సోషల్ మీడియా వేదికగా వ్యాఖ్యానించారు.

దాడిని ఖండించిన భారత్

మక్కా పవిత్ర నగరానికి సమీపంలో డ్రోన్ను అడ్డుకున్న ఘటనపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సౌదీ అరేబియా భూభాగంపై, ముఖ్యంగా పౌరులు, పౌర మౌలిక సదుపాయాలు, ఆర్థిక సంస్థలపై దాడులు ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇలాంటి దాడులు ప్రాంతీయ భద్రత, స్థిరత్వాన్ని దెబ్బతీయడంతో పాటు కీలక సముద్ర మార్గాల్లో నౌకయాన స్వేచ్ఛకు ముప్పుగా మారుతున్నాయని పేర్కొంది. మక్కా ప్రపంచవ్యాప్తంగా ముస్లింలకు అత్యంత పవిత్రమైన నగరం కావడంతో ఈ ఘటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. పవిత్ర ప్రాంతాలు, యాత్రికులు, పౌరుల భద్రతను కాపాడాల్సిన అవసరాన్ని భారత్ నొక్కిచెప్పింది. ఇదే సమయంలో సౌదీ అరేబియాలోని చమురు మౌలిక సదుపాయాలు, వాణిజ్య నౌకాయానంపై జరుగుతున్న దాడులపైనా భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. బాబ్ అల్ మండెబ్ జలసంధి ద్వారా స్వేచ్ఛాయుత, సురక్షిత నౌకాయానం, వాణిజ్య ప్రవాహాన్ని త్వరగా పునరుద్ధరించాలని భారత్ కోరింది.

ఎర్ర సముద్రంలో హౌతీల దూకుడు

ఇటీవల హౌతీలు యెమెన్ ఎర్ర సముద్ర తీర ప్రాంతాల్లో తమ నియంత్రణను విస్తరించడంతో పాటు బాబ్ అల్ మండెబ్ జలసంధిపై అధిపత్యం పెంచుకున్నట్లు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ మార్గం ఎర్ర సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ ఆడెన్తో కలుపుతుంది. అంతర్జాతీయ నౌకాయానానికి ఇది కీలకమైన మార్గం. హౌతీలు సౌదీకి చెందిన నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని ప్రకటించడంతో ఎర్ర సముద్రంలోని నౌకాయాన భద్రతపై ఆందోళనలు పెరిగాయి. హౌతీలు సౌదీ అరేబియాలోని చమురు మౌలిక వసతులను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు సమాచారం. ప్రపంచంలోనే ప్రధాన చమురు ఎగుమతిదారైన సౌదీపై దాడులు అంతర్జాతీయ చమురు మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

నేడే తెలంగాణ విమోచన దినోత్సవం

(మొదటి తరువాయి)

కేంద్ర సాయుధ దళాల విన్యాసాలు, వేలాది మంది తెలంగాణ కళాకారులతో ఆకట్టుకునేలా నాట్య ప్రదర్శనలు, సంప్రదాయ దుస్తుల విన్యాసాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. చారిత్రక పోరాటాలను కళ్లకు కట్టేలా సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని పరేడ్ గ్రౌండ్స్ వద్ద భద్రత, పార్కింగ్, ట్రాఫిక్ తదితర ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన చారిత్రక ఫోటో ఎగ్జిబిషన్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు మాట్లాడుతూ, భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనం కావడంలో అప్పటి ఉప ప్రధాని, హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. పటేల్ చూపిన తెగువ, దృఢ సంకల్పం లేకపోతే తెలంగాణా భారతదేశంలో భాగంగా ఉండేది కాదని ఆయన ప్రశ్నించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, తెలంగాణ నేల పోరాటాలకు, అసమాన త్యాగాలకు నిలయమని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాట స్ఫూర్తిని, అమరుల త్యాగాల చరిత్రను భావితరాలకు సగర్వంగా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

తెలంగాణ చరిత్ర దాచేస్తే దాగదు: ఎంపీ ఈటల రాజేందర్

చరిత్ర దాచేస్తే దాగేది కాదని, నేటి తరం అనుభవిస్తున్న స్వేచ్ఛ వెనుక లక్షలాది మంది చేసిన త్యాగాలు, కోట్లాది ప్రజల కష్టాలు ఉన్నాయని, విద్యార్థులకు చదువు, ఉద్యోగంతో పాటు దేశభక్తి, త్యాగాల విలువను కూడా నేర్పించాలని ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. భరతమాత దాస్య శృంఖలాలను తెంచేందుకు లక్షలాది మంది ప్రాణత్యాగాలు చేశారని అన్నారు. తెలంగాణ విమోచన విషయంలో 'విలీనం, విమోచనం, విముక్తి' అనే పదాలపై చర్చ కంటే, ప్రజలకు స్వేచ్ఛ లభించిన చారిత్రక ఘట్టంగా చూడాలని అన్నారు. చరిత్ర లేకుండా వర్తమానం లేదు.. వర్తమానం లేకుండా భవిష్యత్తు లేదని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. నాటి అమరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించడమే ఇలాంటి ఫోటో ఎగ్జిబిషన్ల లక్ష్యమని తెలిపారు.

టీ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జి!

(మొదటి తరువాయి)

ప్రాధాన్యం సంతరించుకుంది. బుధవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లిన ఆయన రెండు రోజులపాటు అక్కడే ఉండనున్నట్లు సమాచారం. ఒకవైపు రాష్ట్ర కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జి ఎంపిక.. మరోవైపు పార్టీ సంస్థాగత నియామకాలు.. ఇంకోవైపు మంత్రివర్గ విస్తరణ, శాఖల మార్పుపై చర్చలు సాగుతున్న సమయంలో ఆయన ఢిల్లీవెళ్లడం విశేషం.

మూరనున్న సమీకరణాలు?

మీనాక్షి నటరాజన్ తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక సమయంలో బాధ్యతలు నిర్వహించారు. ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం, సంస్థాగత వ్యవహారాలు, ముఖ్యమైన రాజకీయ నిర్ణయాల్లో ఆమె పాత్ర కొనసాగింది. ఇప్పుడు ఆమె స్థానంలో వచ్చే నేత కేవలం ఖాళీలను భర్తీ చేసే ఇన్‌ఛార్జిగా ఉంటారా... లేక రాష్ట్ర కాంగ్రెస్‌లో కొత్త దిశను నిర్దేశించే బాధ్యతను కూడా చేపడతారా? అన్నదే అసలు ప్రశ్న. కొత్త ఇన్‌ఛార్జి ఎంపికలో సీనియారిటీ, రాష్ట్ర రాజకీయాలపై అవగాహన, అధిష్టానంతో సమన్వయం, ముఖ్యమంత్రి, పీసీసీ మధ్య సమతౌల్యం వంటి అంశాలు కీలకంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు సీనియర్ నేతల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ తాజాగా తన రెండేళ్ల పీసీసీ అధ్యక్ష పదవీకాలం పూర్తయిన సందర్భంగా పార్టీని రాష్ట్ర స్థాయి నుంచి బూత్



స్థాయి వరకు బలోపేతం చేశామని చెప్పారు. ఇకపై సంస్థాగత బలోపేతంపై మరింత దృష్టిపెడతామని, ఈ నెలాఖరులోగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం పూర్తి చేస్తామని వెల్లడించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపికలో ఢిల్లీ నుంచి పరిశీలకుల వ్యవస్థను కూడా అమలు చేస్తున్నట్లు చెప్పారు. అంటే.. పార్టీ సంస్థాగత నిర్మాణంలో కీలక నియామకాలు ముందున్నాయన్న చర్చ జరుగుతోంది. డీసీసీ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు.. ఇలా పార్టీ యంత్రాంగంలో పలు స్థాయిల్లో మార్పులు జరగనున్నాయి. ఈ సమయంలో ఢిల్లీకి వెళ్లడం.. కొత్త ఇన్‌ఛార్జితో కలిసి భవిష్యత్ సంస్థాగత నిర్మాణంపై చర్చలకు దారితీస్తాయన్న అంచనాలకు కారణమవుతోంది. మరోవైపు.. మంత్రివర్గంపై మళ్లీ చర్చ మొదలైంది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించిన తరువాత తెలంగాణ కేబినెట్‌లో ఏర్పడిన ఖాళీలు, భవిష్యత్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కాంగ్రెస్‌లో చర్చ కొనసాగుతోంది. సెప్టెంబర్ చివర లేదా అక్టోబర్‌లో ఈ ప్రక్రియపై నిర్ణయం ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

కొత్త ఇన్‌ఛార్జి ముందు మూడు పెద్ద సవాళ్లు

కొత్తగా బాధ్యతలు చేపట్టే ఇన్‌ఛార్జికి ప్రధానంగా మూడు అంశాలు సవాళ్లుగా మారనున్నాయి. మొదటిది పార్టీని ఎన్నికల దిశగా సమీకరించడం. 2028 అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ.. అధికారంలో ఉన్న పార్టీకి సంస్థాగత పునర్నిర్మాణం ఇప్పటి నుంచే కీలకం. రెండోది పార్టీ ప్రభుత్వ సమన్వయం. తనకు ముఖ్యమంత్రితో 'ఒకే తరంగదైర్ఘ్యం'లో పనిచేసే సంబంధం ఉందని మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. కొత్త ఇన్‌ఛార్జి ఈ సమన్వయాన్ని ఎలా కొనసాగిస్తారన్నది కీలకం. మూడోది - అంతర్గత అసంతృప్తికి పరిష్కారం. మంత్రి పదవులు, పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు, నియోజకవర్గాల రాజకీయ సమీకరణలు.. ఇవన్నీ కాంగ్రెస్‌లో సహజంగానే ఆశావహులను పెంచుతున్నాయి. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణపై సీనియర్లు, యువ ఎమ్మెల్యేల మధ్య పోటీ ఉన్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఏదేమైనా 18వ తేదీన ప్రకటించే ఇన్‌ఛార్జి వచ్చాక తెలంగాణ కాంగ్రెస్‌లో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయన్నదే అసలు రాజకీయ కథ.

వార్త సంధ్య
vaartha sandhya
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com

ఎంపీ వద్దిరాజు తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)సెప్టెంబర్ 16.

విలీన దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపారు."ఆపరేషన్ పోలో"తో 1948 సెప్టెంబర్ 17న నిజాం రాజ్యం (ఆసఫ్ జాహీల రాజ్యం)భారత యూనియన్ లో విలీనమైన విషయం తెలిసిందే.మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వాన 14 ఏళ్ల పాటు కొనసాగిన మహోద్యమంతో ఆంధ్ర పెట్టుబడిదారుల వలస పాలన నుంచి తెలంగాణ ప్రాంతానికి "విమోచన"లభించి ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిందని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.ప్రజల సంపూర్ణ మద్దతుతో కేసీఆర్ తాను సాధించి పెట్టిన తెలంగాణకు తొలి ముఖ్యమంత్రి అయి అన్ని విధాలా గొప్పగా అభివృద్ధి చేసి దేశం మొత్తం మీద అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దారని కొనియాడారు.

చారిత్రాత్మక ఘట్టానికి గుర్తుగా కేసీఆర్ సెప్టెంబర్ 17వతేదీని "తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం"గా ప్రకటించి అధికారికంగా పలు కార్యక్రమాలు జరిపించేవారన్నారు.నిజాం పాలన ముగిసి ప్రజలకు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం సిద్ధించిన రోజు అయినందున సెప్టెంబర్ 17వతేదీకి విశేష ప్రాధాన్యత ఉన్నదని ఎంపీ రవిచంద్ర చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో స్వేచ్ఛ హరించుకుపోయి, ప్రజాస్వామ్యం అపహాస్యమవుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణలో పూర్తిగా కుంటుపడిపోయిన అభివృద్ధి తిరిగి పుంజుకోవాలంటే, సంక్షేమ పథకాలు,కార్యక్రమాలు సజావుగా ముందుకు సాగాలంటే,ప్రజలు స్వేచ్ఛావాయువు పీల్చుకోవాలంటే, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే దార్శనికులు కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి కావల్సిందేనని ఎంపీ రవిచంద్ర వ్యాఖ్యానించారు.విలీన దినోత్సవం సందర్భంగా తెలంగాణ వాసులు, దేశంలోని వివిధ ప్రాంతాలు,ప్రపంచం నలుమూలల నివసిస్తున్న,స్థిరపడిన తెలంగాణ బిడ్డలందరికి ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు.



తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ డిపోల్లో అప్రెంటిస్ చేసిన అభ్యర్థుల ఆవేదన..

- శ్రామిక్ నియామకాల్లో కొత్త నిబంధనలతో తీవ్ర అన్యాయం ..
-వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ బక్క జడ్సన్ ఆరోపించారు
-- పాత పద్ధతిలోనే సీనియారిటీ,ఏజ్ వెయిటేజ్ అమలు చేయాలి.
-.ఆర్టీసీ అప్రెంటిస్ అభ్యర్థుల డిమాండ్ చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) సెప్టెంబర్ 16.

: సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ బక్క జడ్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ డ్రైవర్,శ్రామిక్ పోస్టుల భర్తీ ప్రక్రియను పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డుకు అప్పగించడం వల్ల, దశాబ్ద కాలంగా ఆర్టీసీ కొలువుల కోసం ఎదురుచూస్తున్న సీనియర్ అప్రెంటిస్ అభ్యర్థుల జీవితాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని అభ్యర్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చే చేస్తున్నారని,.గతంలో ఉన్న నియామక నిబంధనలను తుంగలో తొక్కి, ఏకపక్షంగా తెచ్చిన కొత్త విధానం వల్ల సుమారు 15 సంవత్సరాల క్రితం ఆర్టీసీ డిపోల్లో అప్రెంటిస్ పూర్తి చేసుకున్న వారికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు.ఈ విధానాన్ని తక్షణమే సవరించాలని డిమాండ్ రాజీవ్ చేశారు

ఆర్టీసీ పాత నిబంధనలకు తిలోదకాలు..

గతంలో ఆర్టీసీ నిర్వహించిన నియామకాల్లో ఐటీఐ మార్కులకు 70 శాతం అప్రెంటిస్‌కు 10 మార్కులు,అలాగే అభ్యర్థుల వయస్సు అప్రెంటిస్ సీనియారిటీకి గరిష్టంగా 20 మార్కుల వెయిటేజ్ ఇచ్చేవారు..కానీ ప్రస్తుత నియామకాల్లో పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ఈ వెయిటేజ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయడం దారుణంమని రాజీవ్ ఆరోపించారు

సర్పంచులకు నిధులు కేటాయించాలి

మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) సెప్టెంబర్ 16.

సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ జనాభా లెక్కల ఎస్ ఎఫ్ సి ప్రకారం నిధులు విడుదల చేయాలని కోరారు గ్రామపంచాయతీలు అభివృద్ధి పరిపాలన సజావుగా కొనసాగాలంటే గ్రామాల్లో ఉన్న జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను ప్రతినెల గ్రామపంచాయతీలకు విడుదల చేయాలని ఆయన కోరారు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పన పారిశుద్ధం త్రాగునీరు వీధి దీపాలు ప్రజా అవసరాల కోసం గ్రామపంచాయతీలకు నిధులు అత్యవస నిధులు సకాలంలో విడుదల కాకపోతే గ్రామాల అభివృద్ధి నిలిచిపోతుందని ఆయన చెప్పారు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సర్పంచులకు నిధులు విడుదల చేయాలని చాలా రోజులుగా వినతి పత్రాలు సమర్పిస్తున్న వారికి నిధులు విడుదల కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ప్రాజెక్టులు కుట్టుబడి పోతున్నాయని తక్షణమే నీటి సమస్య పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు సర్పంచ్ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ సర్పంచ్ల సమస్యలు పరిష్కరించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు గ్రామపంచాయతీలను బలోపేతం చేయాలని ఆయన కోరారు గ్రామాల అభివృద్ధి నిలిచిపోతుందని నిధుల కొరతో సర్పంచి ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు సర్పంచ్లు న్యాయమైన డిమాండ్ తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు ఈ సందర్భంగా హనుమకొండ సిద్దిపేట సంగారెడ్డి మెదక్ జిల్లాల అధ్యక్షులను మాజీ మంత్రి ఘనంగా సత్కరించారు

దుబ్బాకలో భక్తిభావంతో మార్మోగుతున్న నవరాత్రి వేడుకలు

మూడో రోజు ఘనంగా పూజలు.. భక్తులకు అన్నప్రసాద వితరణ.. చిన్నారులతో సందడిగా సాంస్కృతిక కార్యక్రమాలు





దుబ్బాక ప్రతినిధి (వార్త సంధ్య)సెప్టెంబర్ 16

కత్తి కార్తిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ సిద్ధి వినాయక స్వామివారి నవరాత్రి ఉత్సవాలు మూడో రోజు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కత్తి కార్తిక గౌడ్ స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం సాయంత్రం చిన్నారుల కోసం ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించగా.. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఆకట్టుకున్నారు. నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల హాజరుతో ఉత్సవ ప్రాంగణం సందడిగా మారింది. ఉత్సవాలు విజయవంతంగా కొనసాగుతుండటంపై కత్తి కార్తిక గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com

సంపాదకీయం

పపంచ దేశాలు చొరవ తీసుకోవాలి



ప్రపంచవ్యాప్తంగా నేడు జరుగుతున్న యుద్ధాలపై ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ యుద్ధాలవల్ల ప్రపంచం మొత్తం ఆర్థిక సంక్షోభం లోకి నెట్టింది. నేడు పలు దేశాల మధ్య యుద్ధాల వల్ల అన్ని దేశాలలో నిత్యావసర ధరలు ఎగిసిపడుతున్నాయి. వాస్తవానికి యుద్ధాలు మానవాళికి అపారమైన నష్టాన్ని మిగిల్చాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో కోట్లాది మంది సైనికులు, ప్రజలు మరణించారు. రెండో ప్రపంచ యుద్ధంలో అణుశక్తి, సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో మరింత భయంకరమైన విధ్వంసం జరిగింది. దాదాపు ఎనిమిది కోట్ల మంది ప్రాణ నష్టం, లక్షల కోట్ల ధన నష్టం జరిగింది. దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి. అయినా, ప్రపంచానికి శాశ్వత శాంతి లభించలేదు. లీగ్ ఆఫ్ నేషన్స్, ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి వంటి సంస్థలు ఏర్పడినా ప్రపంచంలో యుద్ధాలు ఆగలేదు. సామ్రాజ్యవాదం, ఆర్థిక ఆధిపత్యం, మతపరమైన విద్వేషాలు, పరోక్ష యుద్ధాలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. రెండు ప్రపంచ యుద్ధాల అనంతరం కొరియా, వియత్నాం యుద్ధాలు కూడా లక్షలాది ప్రాణాలను బలి తీసుకున్నాయి. పాలస్తీనా--ఇజ్రాయెల్ ఘర్షణలు, ఉక్రెయిన్ యుద్ధం వంటి సంఘటనలు ప్రపంచాన్ని అశాంతి వైపు నెడుతున్నాయి. గతం నుంచి పాఠాలు నేర్చుకోవడంలో మానవజాతి విఫలమవుతోంది. కళింగ యుద్ధానంతరం పశ్చాత్తాపం చెందిన అశోకుడు.. ప్రజల సంక్షేమం, శాంతి, అభివృద్ధి కోసం కృషి చేశాడు. ప్రస్తుతం ప్రపంచంలో అలాంటి పరివర్తన ఎంతవరకు కనిపిస్తోంది?! వసుధైవ కుటుంబకంలో ప్రపంచమంతా ఒక కుటుంబమే. అయినప్పటికీ, ఆధిపత్య ధోరణులు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులు, మతపరమైన ద్వేషాన్ని రెచ్చగొట్టే వర్గాలు యుద్ధానంతర సమాజ దుస్థితిని మరిచిపోతున్నాయి. అణ్వాయుధాలు, ఖండాంతర క్షిపణులు, అపారమైన ఆయుధ సంపత్తి శాంతిని తీసుకురాలేవు. అదే సంపదను పేదరికం, ఆకలి, వైద్యం, విద్య కోసం వినియోగిస్తే ప్రపంచం మరింత సంతోషంగా మారుతుంది. యెమెన్, సూడాన్, అఫ్ఘనిస్థాన్ వంటి దేశాల్లో ప్రజలు నేటికీ ఆకలి, నిరాశ్రయం, అనారోగ్యంతో బాధపడుతున్నారు. మానవాళిపై దయ, ప్రేమ, సహానుభూతి పెరిగినప్పుడే సుస్థిర శాంతి సాధ్యమవుతుంది. శాంతి చర్చలు కేవలం రాజకీయ ప్రయోజనాలకే పరిమితం కాకుండా మానవ సంక్షేమానికి దారి తీయాలి. ప్రపంచ శాంతి స్థాపనలో భారతదేశం తన సాంస్కృతిక వారసత్వం, అహింసా సిద్ధాంతం, "వసుధైవ కుటుంబకం" భావనల ద్వారా మార్గదర్శకత్వం వహించాలి. మరోవైపు పశ్చిమాసియాలో ఇరాన్?తో చేస్తున్న యుద్ధం అమెరికాకు తీవ్ర ఆర్థిక భారంగా మారుతోంది. 2026 ఆగస్టు నాటికి అమెరికా రక్షణ శాఖ ఈ యుద్ధం కోసం సుమారు 38 బిలియన్? డాలర్లు (సుమారు రూ. 3.65 లక్షల కోట్లు) మేర ఖర్చు చేసినట్లు కాంగ్రెషనల్? బడ్జెట్ ఆఫీస్? (సీబీఓ) తాజా నివేదికలో పేర్కొంది. ఒక వేళ యుద్ధం తీవ్రత జులై నాటి స్థాయికి పెరిగితే, అమెరికా నెలవారీ యుద్ధ ఖర్చు 3 బిలియన్? డాలర్లకు చేరే అవకాశం ఉందని హెచ్చరించింది.సీబీఓ అనేది అమెరికా కాంగ్రెస్?కు, బడ్జెట్?, ఆర్థిక విశ్లేషణలు అందించే ఒక నిష్పాక్షిక సంస్థ. ఇది తాజాగా "ఇరాన్?పై అమెరికా సైనిక చర్యల ఖర్చు అంచనా" అనే పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. అందులో ఇరాన్?తో యుద్ధానికి సంబంధించిన ఖర్చులను నాలుగు విభాగాలుగా చూపించింది. అవి ఏమిటంటే? రక్షణ శాఖ కార్యకలాపాలు, రవాణా, నిర్వహణ ఖర్చులు; ఆర్మ్కెట్? ఖర్చులు (ఒకదాని కోసం కేటాయించినవి మరొకదానికి వాడడం వల్ల కలిగే నష్టం); సరఫరా అంతరాయాలు, ధరల పెరుగుదల వల్ల కలిగే ఆర్థిక నష్టాలు; దౌత్యపరమైన చర్యలు, విదేశీ సాయం వంటి అదనపు ఖర్చులు. "అమెరికా రక్షణ శాఖ ఖర్చు చేసిన 38 బిలియన్ డాలర్లలో ఎక్కువ భాగం, యుద్ధంలో వాడేసిన మందుగుండు సామగ్రిని, నష్టపోయిన ఆయుధాలను మళ్లీ భర్తీ చేసుకోవడానికి ఖర్చు అయ్యింది. యుద్ధ విమానాల మోహరింపు, ఇంధనం ఖర్చు కూడా ఇందులో భాగంగా ఉంది. వాస్తవానికి యుద్ధం ప్రారంభమైన మొదట్లో ఘర్షణలు చాలా తీవ్రంగా జరిగాయి. ప్రస్తుతం తక్కువ తీవ్రతతో నామమాత్రంగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఒకవేళ మే, జూన్? నెలల తరహాలోనే మళ్లీ ఘర్షణలు తీవ్రమైతే, అమెరికా అదనంగా నెలకు 2 బిలియన్? డాలర్లు (సుమారు రూ. 19.182 కోట్లు) ఖర్చు అయ్యే అవకాశం ఉంది. అదే ఈ ఘర్షణలు జులై నాటి తీవ్రతకు పెరిగితే ఆ ఖర్చు నెలకు 3 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 28,773 కోట్లు)కు చేరుతుంది. యుద్ధం తీవ్రత మరింత పెరిగితే ఆ ఖర్చులు ఇంకా పెరగవచ్చు. రక్షణ శాఖ మాకు అవసరమైన సమాచారాన్ని అందించకపోవడం వల్ల, ప్రభుత్వ డేటాబేస్లు, బహిరంగ నివేదికల ఆధారంగా ఈ అంచనాలు వేశాం" అని సీబీఓ పేర్కొంది. జూన్?లో ట్రంప్ ప్రభుత్వం 87.6 బిలియన్ డాలర్ల అదనపు నిధులు కోరింది.అందులో రక్షణ శాఖకు సంబంధించినవే 67.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇందులో ఇరాన్?తో యుద్ధానికి కేటాయించినవి 42.3 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇది సీబీఓ అంచా వేసిన ఖర్చు కంటే 10 శాతం ఎక్కువ కావడం గమనార్హం.క్షిపణి రక్షణ వ్యవస్థల వాడకం భారీగా పెరగడం వల్ల అమెరికా వద్ద మిస్సైల్స్? నిల్వలు భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉందని సీబీఓ ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా సైన్యానికి ఇది ఇబ్బందికర పరిణామమేనని స్పష్టం చేసింది. ఇరాన్? వర్సెస్ అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం వల్ల హర్మూజ్? జలసంధి, ఎర్ర సముద్రం ద్వారా జరిగే చమురు, సహజవాయువు రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు, పెట్రోల్?, డీజిల్, జెట్ ఫ్యూయెల్? ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ ఇంధన ధరల పెరుగుదల వల్ల 2027 మొదటి త్రైమాసికంలో వినియోగ వస్తువుల ధరలు (పీసీఈ) ద్రవ్యోల్బణం మునుపటి అంచనాల కంటే 0.5 శాతం, కోర్ పీసీఈ ద్రవ్యోల్బణం 0.3 శాతం మేర పెరగవచ్చని భావిస్తున్నారు. ఈ ప్రభావం అమెరికా ట్రెజరీ వడ్డీ రేట్లపై కూడా పడే అవకాశం ఉందని, 2026లో మూడు నెలల ట్రెజరీ బిల్లు రేట్లు 0.2 శాతం వరకు పెరగవచ్చని సీబీఓ అంచనా వేసింది. అయితే దౌత్యపరమైన చర్యలు, విదేశీ సహాయానికి అయ్యే అదనపు ఖర్చులను ఇప్పుడే కచ్చితంగా అంచనా వేయలేమని, అది యుద్ధ ముగింపుపై ఆధారపడి ఉంటుందని సీబీఓ పేర్కొంది. ఏదేమైనా ఈ యుద్ధాలు త్వరగా ముగిసిపోతే తప్ప ప్రజలకు కాస్త ఉపశమనం లభించదు. ఆ దిశగా ప్రపంచ దేశాలు చొరవ తీసుకొని యుద్ధాలు జరిగే దేశాల మధ్య సంధి కుదిర్చి మరింత ఆర్థిక సంకోభంలోకి వెళ్ళకుండా చూడాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇస్రోపై 'ప్రైవేటు' మేఘాలు?



దేశ ప్రతిష్ఠను ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లిన సంస్థ భవిష్యత్తుపై ఉద్యోగుల ఆందోళన ఎందుకు? ఎంతవరకు సమంజసం? భారతదేశం అంతరిక్షంలో తన విజయపతాకను ఎగరేసిన ప్రతిసారీ ప్రపంచం మనవైపు వింతగా, ఆశ్చర్యంగా చూసింది. ఆ విజయాల వెనుక నిలిచిన శక్తివంతమైన పేరు – భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో. చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని చేరడం నుంచి అంగారకుడి కక్ష్యను అందుకోవడం వరకు, వాతావరణ పరిశీలన నుంచి వ్యవసాయం, సమాచార వ్యవస్థలు, నావిగేషన్, విపత్తుల నిర్వహణ వరకు దేశానికి అవసరమైన ఎన్నో రంగాల్లో ఇస్రో తన సామర్థ్యాన్ని నిరూపించింది. సేవలందిస్తోంది!! అటువంటి సంస్థ భవిష్యత్తు పాత్రపై ఇప్పుడు దాని ఉద్యోగ సంఘాలే ఆందోళన వ్యక్తం చేయడం సహజంగానే దేశ ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటీవల ఇస్రోకు చెందిన తొమ్మిది ఉద్యోగ సంఘాలు సంస్థలో జరుగుతున్న మార్పులు, పెరుగుతున్న ప్రైవేట్ రంగం పాత్ర, ఉద్యోగుల భవిష్యత్తు, ఇస్రో బాధ్యతలపై స్పష్టమైన వివరణ కోరాయి. అదే సమయంలో ఇస్రో నుంచి వంద మందికి పైగా శాస్త్రవేత్తలు రాజీనామా చేయడం లేదా స్వచ్ఛంద పదవీ విరమణ పొందడం గురించి నివేదికలు వెలువడ్డాయి. మెరుగైన వేతనాలు, అవకాశాలు, ప్రైవేట్ అంతరిక్ష సంస్థల ఆకర్షణ కూడా ఇందుకు కారణాలుగా పేర్కొంటున్నారు. ఇది కేవలం ఉద్యోగుల బదిలీ సమస్య కాదు. ఒక శాస్త్రవేత్త ఇస్రోను వీడితే, అతనితోపాటు అపారమైన అతని మేధ, అసాధారణమైన అతని ప్రతిభ, దశాబ్దాల అనుభవం, సాంకేతిక పరిజ్ఞానం, సంస్థాగత జ్ఞానం కూడా బయటకు వెళ్లే ప్రమాదం ఉంటుంది. శాస్త్ర విజ్ఞానంలో మానవ వనరులే అసలు సంపద. ఒక ప్రయోగశాలను నిర్మించవచ్చు; ఒక యంత్రాన్ని కొనవచ్చు; కానీ దశాబ్దాల అనుభవాన్ని, ప్రతిభను కొనలేం. ఇస్రోను ప్రైవేటీకరిస్తున్నారా? ప్రస్తుతం ప్రభుత్వం అలాంటి నిర్ణయం తీసుకున్నట్లు ఆధారం లేదు. గత సెప్టెంబర్ 6న ఇస్రో స్వయంగా ఒక ప్రకటన చేస్తూ.. ఇస్రోను ప్రైవేటీకరించడం లేదని, దాని ప్రాధాన్యతను తగ్గించబోమని ప్రకటించింది. అధునాతన అంతరిక్ష పరిశోధన, జాతీయ-వ్యూహాత్మక మిషన్లు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ, కీలక సాంకేతిక సామర్థ్యాలు ఇస్రో ఆధీనంలోనే కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఈ హామీని విస్మరించాల్సిన అవసరం లేదు. అంతమాత్రాన ప్రభుత్వాల ప్రకటనలను వందకు వందశాతం నమ్మలేం. ఎందుకంటే గత చరిత్రలు అలా ఉన్నాయి ప్రజాస్వామ్యంలో హామీలతో పాటు విధాన దిశను కూడా పరిశీలించడం అవసరం. గత 2020 నుంచి భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థలకు ద్వారాలు తెరిచారు. ఇన్ స్పేస్ వంటి వ్యవస్థల ద్వారా ప్రైవేట్ కంపెనీలకు ఉపగ్రహాలు, ప్రయోగ వాహనాలు, అంతరిక్ష సేవల్లో అవకాశాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వం చెబుతున్న లక్ష్యం– ఇస్రోను బలహీనపరచడం కాదు; ప్రైవేట్ పరిశ్రమను భాగస్వామిగా చేసుకుని భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను విస్తరించడం. ఈ లక్ష్యంలో తప్పేమీ లేదు. ప్రైవేట్ రంగం ఎదగాలి. పెట్టుబడులు రావాలి. కొత్త సాంకేతికతలు అభివృద్ధి చెందాలి. ఉపాధి పెరగాలి. ప్రపంచ అంతరిక్ష మార్కెట్లో భారతదేశం తన వాటాను పెంచుకోవాలి. కానీ, అసలు ప్రశ్న వేరే! ప్రైవేట్ భాగస్వామ్యం ఎక్కడ ముగుస్తుంది? ప్రభుత్వ వ్యూహాత్మక ఆధిపత్యం ఎక్కడ మొదలవుతుంది? ఈ ప్రశ్నకు స్పష్టమైన హద్దు అవసరం. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరిచే ప్రక్రియ ఒక్క రోజులో జరగదు. పెట్టుబడులు తగ్గడం, నియామకాలు మందగించడం, ప్రతిభకు తగిన ప్రోత్సాహం లేకపోవడం, పదోన్నతులు ఆలస్యం కావడం, వేతనాల్లో ప్రైవేట్ రంగంతో అంతరం పెరగడం – ఇవన్నీ క్రమంగా ఒక సంస్థ సామర్థ్యాన్ని దెబ్బతీయవచ్చు. ఆ తరువాత సంస్థ పనితీరు తగ్గింది, ప్రైవేట్ రంగమే సమర్థవంతం అనే వాదనకు అవకాశం ఏర్పడుతుంది. స్థానికక్లబ్‌లలో చేరండి భారతదేశంలో ప్రయివేటు పరమైన అనేక ప్రభుత్వ రంగ సంస్థల చరిత్ర ఈ విషయంలో మనకు హెచ్చరికలు చేస్తున్నాయి. ఒకప్పుడు ఈ సంస్థలు దేశ పారిశ్రామిక, సాంకేతిక స్వావలంబనకు ప్రతీకలుగా నిలిచాయి. ఇప్పటికే విమానాశ్రయాలు, పోర్టులు, గనులు, రహదారులు, పెట్రోలియం వంటి సహజవనరులు ప్రయివేటు రంగంలోకి వెళ్లిపోయాయి. బిఎస్ఎన్ఎల్ దేశవ్యాప్తంగా టెలికాం మౌలిక వ్యవస్థ నిర్మాణంలో అపారమైన పాత్ర పోషించింది. ఇప్పుడు దాని పరిస్థితి ఏమిటి? అయితే, ప్రభుత్వ రంగ సంస్థల బలహీనతకు అనేక కారణాలున్నాయి; ప్రతి పతనాన్నీ ప్రైవేటీకరణకే ఆపాదించడం సరైంది కాదు. కానీ ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయకుండా, దాని బలహీనతనే ప్రైవేటీకరణకు కారణంగా చూపే విధానం మాత్రం ప్రశ్నించాల్సిందే. కేంద్ర ప్రభుత్వ డిఐపిఎఎం గణాంకాలు కూడా గత దశాబ్దంలో భారీ స్థాయిలో పెట్టుబడుల ఉపసంహరణ జరిగిన విషయాన్ని వెల్లడిస్తున్నాయి. 2014 -15 నుంచి 2026 -27 వరకు కేంద్ర ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ. 5.10 లక్షల కోట్లకు పైగా నిధులు సమాకూరినట్లు నమోదైంది. అందువల్లే ఉద్యోగ సంఘాలు, పౌరసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కారణంగా ప్రభుత్వ ఆస్తులపై ప్రభుత్వ పాత్ర ఏ దిశగా మారుతోంది అన్న ప్రశ్న మాత్రం సముచితమైనదే. ఇప్పుడు అదే ప్రశ్నను ఇస్రో ముందు పెట్టాల్సిన అవసరం వచ్చింది. ఎందుకంటే అంతరిక్షం సాధారణ వ్యాపార రంగం కాదు. అది దేశ రక్షణతో, వ్యూహాత్మక సమాచారంతో, నిఘా సామర్థ్యాలతో, కమ్యూనికేషన్ వ్యవస్థలతో, జాతీయ భద్రతతో ముడిపడి ఉంది. అందువల్ల అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం ఉండవచ్చు; ప్రైవేట్ పరిశ్రమ ఎదగవచ్చు; కానీ కీలక వ్యూహాత్మక సామర్థ్యాలపై తుది నియంత్రణ మాత్రం ప్రభుత్వానిదే ఉండాలి. ఇస్రోను కాపాడుకోవడం అంటే ప్రైవేట్ రంగాన్ని వ్యతిరేకించడం కాదు. అభివృద్ధిని అడ్డుకోవడం కాదు. దేశ శాస్త్రీయ స్వావలంబనకు పునాదిగా నిలిచిన ఒక జాతీయ సంస్థను బలహీనపరచకూడదని చెప్పడం. ఇస్రోపై ఈ రోజు నిజంగానే ప్రైవేటు మేఘాలు కమ్ముకున్నాయా? ప్రభుత్వం చెబుతున్నట్లు అవి కేవలం అభివృద్ధి మేఘాలేనా? లేక భవిష్యత్తులో మరింత పెద్ద మార్పులకు ఇవి సంకేతాలా?

ఉచిత హామీలతో ఉచ్చు

ప్రధాన ఎన్నికల హామీలకు సంబంధించిన ఐదేళ్ల ఆర్థిక వ్యయం, నిధుల సమీకరణ మార్గాలను వెల్లడించడం, స్వతంత్ర ఆర్థిక పరిశీలనకు అవకాశం కల్పించడం, మేని ఫెస్టో హామీలపై పారదర్శకతను పెంచడం అవసరం. రాష్ట్రాలు మధ్యకాలిక వ్యయ ప్రణాళికలను రూపొందించాలి. తద్వారా పునరావృత సంక్షేమ వ్యయాలు మూలధన పెట్టుబడులకు అడ్డంకిగా మారకుండా చూడవచ్చు. ఎంపిక సంక్షేమమా? అభివృద్ధా? అన్నది కాదు. లక్ష్యం అభి వృద్ధి ద్వారా సంక్షేమాన్ని అందించడమే కావాలి. పేదలకు సామాజిక భద్రత, మహిళలకు ఆర్థిక స్వావలంబన, యువతకు ఉద్యోగాలు అవసరం.



భారత ప్రజాస్వామ్యంలో సంక్షేమ రాజకీయాలు కొత్త దశలోకి ప్రవేశిస్తున్నాయి. అభివృద్ధి, ఉపాధి, పాలన, సిద్ధాంతాలపై మాత్రమే ఎన్నికలు జరగడం లేదు. ఓటర్లకు తక్షణంగా ఎక్కువ ప్రయోజనాలు ఎవరు అందిస్తారనే పోటీ కూడా పెరుగుతోంది. బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయడం, ఉచిత విద్యుత్, సబ్సిడీ ఆహారం, ఉచిత రవాణా, రుణ మాఫీలు, వంటగ్యాస్ సిలిండర్లు.. ఇలా ప్రభుత్వ ప్రయోజనాల జాబితా విస్తరిస్తోంది. ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకున్న షరతుల్లేని నగదు బదిలీ పథకాలు (యుసిటి) ఈ ధోరణికి ప్రతీకగా మారాయి. అసోం 'ఒరునోదోయ్', పశ్చిమ బెంగాల్ 'లక్ష్మీర్ భండార్', కర్ణాటక 'గృహలక్ష్మి', మధ్యప్రదేశ్ 'లాడ్లీ బెహనా', తమిళనాడు 'మగలిర్ ఉరిమై తొగై', మహారాష్ట్ర 'లాడ్కీ బహిన్', ఒడిశా 'సుభద్ర' వంటి పథకాలు సంక్షేమాన్ని ఎన్నికల పోటీలో కీలక అంశంగా మార్చాయి. పిఆర్ఎస్ అంచనా ప్రకారం.. 202526లో 12 రాష్ట్రాలు ఇటువంటి నగదు బదిలీల కోసం సుమారు రూ. 1.68 లక్షల కోట్లను బడ్జెట్‌లో కేటాయించాయి. పేదలు, బలహీన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలవడంలో తప్పేమీ లేదు. గౌరవప్రదమైన జీవనోపాధిని పొందలేని వారికి సామాజిక భద్రత కల్పించడం సంక్షేమ రాజ్య బాధ్యత. అయితే దీర్ఘకాలిక ఆర్థిక పరిణామాలను పరిగణనలోకి తీసుకోకుండా.. ఎన్నికల కోసం సంక్షేమ పథకాలు అంతకంతకూ విస్తరించడం ఆందోళన కలిగించే అంశం. రాజకీయంగా వీటి ఆకర్షణ స్పష్టంగా కనిపిస్తుంది. రహదారి, రైల్వే, పారిశ్రామిక పార్కు లేదా విశ్వవిద్యాలయం వంటి అభివృద్ధి ప్రాజెక్టులు ఫలితాలు ఇవ్వడానికి ఏళ్లు పడుతుంది. కానీ నగదు బదిలీ ప్రతి నెలా నేరుగా కుటుంబ ఖాతాలోకి చేరుతుంది. అందుకే మహిళలు ఈ కొత్త రాజకీయ ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా మారుతున్నారు. అసోంలోని 'ఒరునోదోయ్' ఇందుకు ఒక ఉదాహరణ. 2026 నాటికి దాదాపు 40 లక్షల మంది మహిళలు ఈ పథకం పరిధిలోకి వచ్చారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సుమారు 40 లక్షల మంది మహిళలకు రూ. 9,000 చొప్పున బదిలీ చేయగా.. దాదాపు రూ. 3,600 కోట్ల వ్యయం అయింది. ఆ తర్వాత నెలవారీ సాయాన్ని దశలవారీగా రూ. 3,000కు పెంచుతామని, లబ్ధిదారుల సంఖ్యను కూడా విస్తరిస్తామని బిజెపి హామీ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో బిజెపి 126 స్థానాలున్న అసెంబ్లీలో 82 సీట్లు గెలుచుకుంది. అయితే ఆ విజయానికి ఒక్క 'ఒరునోదోయ్'నే కారణమని చెప్పడం సరికాదు. అయినప్పటికీ ప్రత్యక్ష నగదు బదిలీలకు ఉన్న ఎన్నికల ప్రాధాన్యాన్ని ఈ పరిణామం స్పష్టం చేస్తుంది. పశ్చిమ బెంగాల్‌లో 'లక్ష్మీర్ భండార్' తృణమూల్ కాంగ్రెస్ సంక్షేమ రాజకీయాల్లో కీలకంగా మారింది. దీనిని వ్యతిరేకించడానికి బదులుగా బిజెపి మహిళలకు మరింత ఎక్కువ మొత్తాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. దీంతో పోటీ సంక్షేమం అవసరమా? అన్న దానికంటే.. ఎవరు ఎక్కువ ఇస్తారు? అనే స్థాయికి చేరింది. తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లోనూ ఇలాంటి పోటీ కనిపిస్తోంది. అయితే ఈ పరిణామాన్ని ఒక్క రాజకీయ పార్టీకి ఆపాదించడం కూడా సరికాదు. బిజెపితోపాటు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, డిఎంకె, అన్నాడిఎంకె, ఇతర ప్రాంతీయ పార్టీలు కూడా ఇటువంటి పోటీలో భాగమయ్యాయి. సమస్య ఏ ఒక్క పార్టీది కాదు.. వ్యవస్థాగతమైనది. అసలు ఆందోళన ఆర్థిక భారం. 21 రాష్ట్రాల్లో సబ్సిడీలు, నగదు బదిలీలు 201819లో రూ. 3.86 లక్షల కోట్ల నుంచి 202324లో రూ. 7.59 లక్షల కోట్లకు దాదాపు రెట్టింపయ్యాయి. 202526లో ఈ మొత్తం రూ. 9.73 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. పిఆర్ఎస్ ప్రకారం.. ప్రధాన యుసిటి పథకాలు అమలు చేస్తున్న 12 రాష్ట్రాల్లో ఆరు రాష్ట్రాలు 202526లో రెవెన్యూ లోటును అంచనా వేశాయి. కర్ణాటకలో యుసిటి వ్యయం లేకపోతే రాష్ట్ర రెవెన్యూ మిగులు 0.3 శాతంగా ఉండేదని, ఈ వ్యయాన్ని కలిపితే 0.6 శాతం లోటు ఏర్పడుతుందని అంచనా. పెరుగుతున్న సబ్సిడీలు, బదిలీలతో వచ్చే ఆర్థిక ప్రమాదాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా పలుమార్లు హెచ్చరించింది. ఉత్పాదక వ్యయానికి, ముఖ్యంగా మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం వంటి అభివృద్ధి రంగాలకు కేటాయించే నిధులకు ఇలాంటి పథకాలు పరిమితులు సృష్టించకూడదని సూచించింది. వేగంగా పెరుగుతున్న నగదు బదిలీలు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, మానవ వనరులపై ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించే అవకాశం ఉందని ఆర్థిక సర్వే కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఇది దేశంలోని నిరుద్యోగ సమస్యతో నేరుగా ముడిపడిన అంశం. నగదు బదిలీలు తక్షణ ఉపశమనం కలిగించవచ్చు. కుటుంబ వినియోగాన్ని పెంచవచ్చు. కానీ అవి కర్మాగారాలను, పారిశ్రామిక కారిడార్లను, పరిశోధనా సంస్థలను, నైపుణ్య ఆధారిత ఉద్యోగాలను సృష్టించవు. యువతకు శాశ్వతంగా ప్రభుత్వ సాయం కంటే.. స్థిరమైన, గౌరవప్రదమైన ఆదాయాన్ని అందించే ఆర్థిక వ్యవస్థ అవసరం 2022లో ఎన్నికల ఉచిత హామీలపై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు వాటి ఆర్థిక ప్రభావంపై ఆందోళన వ్యక్తం చేసింది. 2026 ఫిబ్రవరిలోనూ బాధ్యతారహితమైన ఎన్నికల ముందు ఉచిత హామీలు అభివృద్ధికి ఆటంకం కలిగించే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది. అయితే ఈ వ్యాఖ్యలను సంక్షేమానికి వ్యతిరేకంగా చూడకూడదు. ప్రజాధనాన్ని ఎన్నికల హామీల ద్వారా ఖర్చు చేయడానికి ముందు.. దాని ఆర్థిక భారం, అభివృద్ధి ప్రాధాన్యాలపై ప్రభావం గురించి పారదర్శకత ఉండాలన్నదే అసలు ప్రశ్న. పార్టీలు ఒకదానికొకటి మించి హామీలు ఇవ్వడం మొదలైతే ఎన్నికలు ప్రభుత్వ వనరుల వేలంగా మారే ప్రమాదం ఉంది. ఒకసారి ప్రయోజనం అందించడం ప్రారంభించిన తర్వాత దాన్ని వెనక్కి తీసుకోవడం రాజకీయంగా కష్టమవుతుంది. దీంతో ఎన్నికల హామీ హక్కుగా మారుతుంది.. ఆ హక్కు ప్రభుత్వంపై ఆర్థిక బాధ్యతగా మారుతుంది.. ఆ బాధ్యత అభివృద్ధి వ్యయాన్ని పరిమితం చేస్తుంది. తదుపరి ఎన్నికల్లో మరింత పెద్ద హామీలకు ఒత్తిడి పెరుగుతుంది. ఇదే పోటీ ప్రజాకర్షక రాజకీయాల విషచక్రం. అయితే ఉచిత పథకాలు ఎన్నికల్లో విజయాన్ని హామీ ఇస్తాయా? ఇటీవలి ఎన్నికలు అందుకు స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదు. అసోంలో సంక్షేమం ఎన్నికల వ్యూహంలో కీలకంగా పనిచేసినప్పటికీ.. పశ్చిమ బెంగాల్ ఫలితాలు బలమైన సంక్షేమ వ్యవస్థ ఉన్నంత మాత్రాన అధికార పార్టీ విజయం ఖాయమని చెప్పలేమని చూపించాయి. తమిళనాడులోనూ సంక్షేమం ఒక్కటే ఓటర్ల నిర్ణయాన్ని శాశ్వతంగా ప్రభావితం చేయడం లేదని స్పష్టమవుతోంది. అందువల్ల సంక్షేమాన్ని ఎన్నికల ఉచిత హామీల నుంచి వేరు చేసి చూడాల్సిన అవసరం ఉంది. పేద మహిళ తన కుమార్తె చదువు కొనసాగించడానికి, పోషకాహార అవసరాలు తీర్చుకోవడానికి అందే సాయం సామాజికంగా విలువైనదే. అయితే మహిళలకు నైపుణ్య శిక్షణ, రుణ సదుపాయం, మార్కెట్ అవకాశాలు, వ్యాపార ప్రోత్సాహం, ఉపాధితో నగదు సాయాన్ని అనుసంధానిస్తే దాని ప్రభావం మరింత విస్తరిస్తుంది. బ్రెజిల్‌లోని 'బోల్సా ఫామిలియా' వంటి పథకాలు నగదు సాయాన్ని విద్య, ఆరోగ్యంతో అనుసంధానించాయి. లక్ష్యం కేవలం డబ్బు ఇవ్వడం కాదు.. మానవ వనరుల అభివృద్ధి ద్వారా పేదరికం తరతరాలకు కొనసాగకుండా చూడటం. భారత్ కూడా సంక్షేమాన్ని ప్రజలను ప్రభుత్వంపై ఆధారపడేలా కాకుండా ఆర్థికంగా స్వావలంబులుగా మార్చే దిశగా మలచాలి. ప్రధాన ఎన్నికల హామీలకు సంబంధించిన ఐదేళ్ల ఆర్థిక వ్యయం, నిధుల సమీకరణ మార్గాలను వెల్లడించడం, స్వతంత్ర ఆర్థిక పరిశీలనకు అవకాశం కల్పించడం, మేనిఫెస్టో హామీలపై పారదర్శకతను పెంచడం అవసరం. రాష్ట్రాలు మధ్యకాలిక వ్యయ ప్రణాళికలను రూపొందించాలి. తద్వారా పునరావృత సంక్షేమ వ్యయాలు మూలధన పెట్టుబడులకు అడ్డంకిగా మారకుండా చూడవచ్చు. ఎంపిక సంక్షేమమా? అభివృద్ధా? అన్నది కాదు. లక్ష్యం అభివృద్ధి ద్వారా సంక్షేమాన్ని అందించడమే కావాలి. పేదలకు సామాజిక భద్రత, మహిళలకు ఆర్థిక స్వావలంబన, యువతకు ఉద్యోగాలు అవసరం. అయితే ఇవన్నీ వచ్చే ఎన్నికల వరకే కాకుండా.. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు ఆలోచించాలి. విజయవంతమైన సంక్షేమ రాజ్యానికి కొలమానం ఎంతమంది ప్రభుత్వ సాయంపై ఆధారపడి ఉన్నారన్నది కాదు.. ఎంతమంది విద్య, నైపుణ్యాలు, ఉపాధి, ఆర్థిక భద్రతను సంపాదించుకుని గౌరవప్రదమైన జీవితాన్ని స్వతంత్రంగా నిర్మించుకోగలిగారన్నదే. ప్రజలను కేవలం లబ్ధిదారులుగా, ఎన్నికలను ప్రభుత్వ ప్రయోజనాల వేలంగా మార్చినప్పుడు ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com

మహేష్ కుమార్ గౌడ్ రెండేళ్ల నాయకత్వానికి ఘన అభినందనలు

టీపీసీసీ అధ్యక్షుడిగా విజయవంతమైన రెండేళ్ల ప్రస్థానంపై ప్రశంసలు

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనపై హర్షం.. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని పిలుపు



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)సెప్టెంబర్ 16. : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా టీపీసీసీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వాన్ని కొనియాడుతూ, ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.
రెండేళ్ల కాలంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, నాయకులు--కార్యకర్తలను సమన్వయంతో ముందుకు నడిపించడం, ప్రజా సమస్యలను పార్టీ వేదికగా బలంగా వినిపించడం వంటి అంశాల్లో టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ కీలక పాత్ర పోషించారని నాయకులు పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం ఏర్పడిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తిచేసుకున్న నేపథ్యంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై కూడా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ శ్రేణులు మరింత చురుగ్గా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు.
ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ విభాగం నాయకులు మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. ఎస్సీ వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎస్సీ విభాగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో మారపెల్లి కుమార్, జగదీశ్వర్ రావు, నార పోగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని మహేష్ కుమార్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని వారు అన్నారు. టీపీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ నార పోగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో ఎస్సీ విభాగం కీలక పాత్ర పోషించాలని అన్నారు.
అణగారిన వర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.
టీపీసీసీ వైస్ చైర్మన్ జగదీశ్వర్ రావు మాట్లాడుతూ.. మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని అన్నారు.
కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో జీవన్ జ్యోతి డాక్టర్ డా. సంతోష్ ముదిరాజ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. టీపీసీసీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమ ఏర్పాట్లు, నాయకులు--కార్యకర్తల సమన్వయం, కార్యక్రమ నిర్వహణ తదితర అంశాలను సమర్థవంతంగా పర్యవేక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఆయన చేసిన కృషిని నాయకులు అభినందించారు.
పార్టీ నాయకత్వం పట్ల పూర్తి నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేస్తూ కవ్వంపల్లి సత్యనారాయణ మార్గదర్శకత్వంలో, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.
చివరగా ప్రత్యేకంగా అభినందనలు
టీపీసీసీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గద్దల హైమావతి మహేష్ కుమార్ గౌడ్ రెండేళ్ల విజయవంతమైన నాయకత్వానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పార్టీ కార్యక్రమాల పట్ల అత్యంత చురుకుదనంతో, నిరంతర శ్రమతో పనిచేస్తూ పార్టీ కోసం అంకితభావంతో ముందుకు సాగుతున్న హైమావతి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని నాయకులు పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో, నాయకత్వ నిర్ణయాలకు కట్టుబడి ప్రజా సమస్యలపై స్పందిస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆమె చూపుతున్న చొరవ అభినందనీయమని అన్నారు.
మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడాలని, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి లక్ష్యాలతో పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంతో ప్రజల మధ్య పనిచేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

కార్మిక మంత్రి వివేక్ వెంకటస్వామి

చెన్నూరు, సెప్టెంబర్ 16 (వార్త సంధ్య):
హైదరాబాద్ లో ఆర్టీసీ కార్మికులు ప్రజా రవాణా వ్యవస్థకు వెన్నెముకలాంటి వారని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ప్రతిరోజూ ఎండ, వానలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తూ లక్షలాది మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.ఆర్టీసీ కార్మికులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొని వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు, విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులు తమ సమస్యలు, అభిప్రాయాలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిని మంత్రి శ్రద్ధగా విన్నారు.కార్మికుల హక్కులు, గౌరవం, భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడంలో ఆర్టీసీ కార్మికుల కృషి ఎంతో కీలకమని మంత్రి వివేక్ వెంకటస్వామి అభినందించారు.

ఆపరేషన్ పోలో వీరుడు సర్దార్ పటేల్‌కు ఘన నివాళి



వార్త సంధ్య కూకట్‌పల్లి :
రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కి ఘనంగా నివాళులర్పించారు. 1948లో ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసి, నిజాం పాలన నుంచి ప్రజలకు విముక్తి కల్పించిన పటేల్ సేవలను స్మరించుకున్నారు.
వసంత్‌నగర్ డివిజన్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నగర్, మూసాపేట్ డివిజన్‌లోని సర్దార్ పటేల్ నగర్‌లలో ఉన్న ఆయన విగ్రహాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు నేతృత్వంలో పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని కోరుతూ కూకట్‌పల్లి, బాలానగర్ మండల రెవెన్యూ అధికారులకు పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రాలు అందజేశారు.
ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ... 1948 సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు జరిగిన ఆపరేషన్ పోలోతో తెలంగాణ ప్రజలకు నిజాం విముక్తి లభించిందని, ఈ చారిత్రక ఘట్టం భావితరాలకు తెలియాలంటే సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, వివిధ డివిజన్ల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం వద్ద పారిశుద్ధ్య పనులు

చిన్నారులు, బాలింతలకు ఇబ్బందులు లేకుండా చెత్తాచెదారం తొలగింపు



సింగరేణి ప్రతినిధి,సెప్టెంబర్ 16 (వార్త సంధ్య):
సింగరేణి మండలం స్టేషన్ చీమలపాడు గ్రామ పరిధిలోని అంగన్వాడీ కేంద్రం వద్ద చాలా కాలంగా పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, చెట్ల వ్యర్థాలను బుధవారం తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. అంగన్వాడీ కేంద్రానికి నిత్యం వచ్చే చిన్నారులు, బాలింత తల్లులకు చెత్తాచెదారం కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని అంగన్వాడీ టీచర్ రజిత గ్రామ ఉపసర్పంచ్ ధరావత్ అడవి లాలు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రం పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, చెట్ల వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. చిన్నారులు, బాలింతలు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంలో అంగన్వాడీ కేంద్రానికి వచ్చేలా పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. “గ్రామ అభివృద్ధి మనందరి బాధ్యత” అనే ఉద్దేశంతో ప్రజలకు ఉపయోగపడే పారిశుద్ధ్య కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో ధరావత్ కోటేష్, మాలోతు మాన్సింగ్, దండు ప్రసాద్, మేడేపల్లి శ్యామ్, బానోతు వీరు, బానోతు మల్ఖార్, బాదావత్ వీరన్న, భానోతు చిన్ని, గుగులోతు జ్యోతి, దండు సునీత, మాలోతు బద్రి, ఎల్లవుల కవిత తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి ప్లాజాలో ఘనంగా అన్నదానం



వార్త సంధ్య కూకట్‌పల్లి :
వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లిలోని పద్మావతి ప్లాజాలో ‘ప్లాజా కా రాజా’ పేరుతో ప్రతిష్ఠించిన గణనాథుడి సన్నిధిలో బుధవారం అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. పద్మావతి ప్లాజా గ్రౌండ్ ఫ్లోర్‌లో దాతల సహకారంతో ఈ అన్నసమారాధన నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, భక్తులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవ నిర్వాహకులు, వ్యాపారులు స్వయంగా పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో విలసిల్లాలని ఈ సందర్భంగా నిర్వాహకులు ఆకాంక్షించారు.
.....

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com

గణేష్ మండపాలు, నిమజ్జనాల వద్ద పటిష్ట బందోబస్తు చర్యలు ఏర్పాటు

-కంట్రోల్ రూమ్ ఏర్పాటు ద్వారా నిరంతర పర్యవేక్షణ

-ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ నిమజ్జనాలకు అన్ని చర్యలు తీసుకున్నాం

-బాపట్ల జిల్లా ఎస్పీ బీ. ఉమా మహేశ్వర్





బాపట్ల జిల్లా (వార్త సంధ్య)సెప్టెంబర్ 16.
బాపట్ల జిల్లాలోని ప్రజలందరూ శాంతికరమైన వాతావరణంలో గణేష్ చతుర్థి వేడుకలను జరుపుకోవడానికి రక్షణ పరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నట్లు, బాపట్ల జిల్లాలో సముద్ర తీర ప్రాంతం మరియు నదీ పరివాహక ప్రాంతం ఎక్కువగా ఉండటంతో స్థానికంగా ఉండే గణేష్ విగ్రహాలే కాకుండా సుదూర ప్రాంతాలు, పక్క జిల్లాల నుండి కూడా భక్తులు వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకువస్తారనే ఉద్దేశంతో ముందస్తుగా నిమజ్జనాలు జరిగే ప్రదేశాల్లో అధిక సంఖ్యలో సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని, స్థానిక పోలీసులు అధికారులు గణేష్ ప్రతిమలను ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులతో ప్రతిరోజు మాట్లాడుతూ, వారికి ఎప్పటికప్పుడు జాగ్రత్త చర్యల గురించి సూచనలు ఇస్తూ గణేష్ మండపాల వద్ద సీసీ కెమెరాలు, ఫైర్ ఎక్టింగ్విషెర్ లు, ఇసుక బకెట్ లఏర్పాటు, కరెంటు కనెక్షన్ ఇచ్చిన విధానం ప్రతి విషయాన్ని రక్షణ దృష్ట్య పరిశీలిస్తూ, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారని. అంతేకాకుండా రాత్రి సమయంలో ఎటువంటి దొంగతనాలకు తావు లేకుండా ఉండేందుకు రాత్రి బీట్ సిబ్బంది ద్వారా వారి పరిధిలో పర్యవేక్షించేటట్టు చర్యలు తీసుకున్నామని తెలిపారు. పోలీసు వారు తీసుకునే ప్రతి ఒక్క ముందస్తు జాగ్రత్త చర్యలు భక్తుల సౌకర్యార్థమేనని గ్రహించి మండపాల కార్యనిర్వాహక సభ్యులు పోలీసువారికి సహకరించి ప్రశాంతమైన ఆహ్లాదకరమైన వాతావరణంలో పండగను జరుపుకోవాలని తెలిపారు.

18న మెగా సెగ్రిగేషన్ డ్రైవ్ ట్రైల్ రన్

- సిబ్బంది మోహరింపు, ప్రజలకు అవగాహనపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష



ఒంగోలు,(వార్త సంధ్య)సెప్టెంబర్ 16. :
ఈనెల 19వ తేదీన నిర్వహించే ' మెగా సెగ్రిగేషన్ డ్రైవ్ ' లో భాగంగా శుక్రవారం ట్రైల్ రన్ నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 ఏళ్ళు అవుతున్న సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమం ' వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ' లో నిలిచేలా చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో బుధవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.మున్సిపాలిటీ పరిధిలో 80 వేలకు పైగా ఇళ్ళు ఉన్నాయని, తడి చెత్తను, పొడి చెత్తను ఇంటి వద్దే వేరువేరుగా వేసేలా ప్రతి ఇంటికీ ప్రత్యేక సంబర్లతో కూడిన 2 బయోడిగ్రేడబుల్ కవర్లను మున్సిపల్ అధికారులు గురువారం సరఫరా చేస్తారు. తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేయాల్సిన ఆవశ్యకతను, ఈ ' మెగా సెగ్రిగేషన్ డ్రైవ్ ' లక్ష్యాలను, ఒంగోలు మున్సిపాలిటీ 150 ఏళ్ల వేడుకల వివరాలతో కూడిన కరపత్రాలను కూడా అందిస్తారు. శనివారం ఉదయం మున్సిపాలిటీ వ్యాప్తంగా ఒక గంట పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందికి సహాయం చేసేలా మెప్మా సభ్యులను కూడా వినియోగించుకోవాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఒంగోలు పారిశుధ్య కార్మికులకు అదనంగా సమీప మండలాలలోని పంచాయతీ కార్మికులను కూడా ఈ విధులకు ప్రత్యేకంగా తరలించాలని చెప్పారు. సేకరించిన చెత్తను రవాణా చేసేందుకు అవసరమైన వాహనాల మోహరింపు, వాటికి నిర్దిష్ట సిబ్బంది కేటాయింపు, శానిటేషన్ డివిజన్ల వారీగా ఈ డ్రైవ్ పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయి అధికారులను కూడా కేటాయిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా జరిగేలా చూడాలన్నారు. ఇందుకోసం శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించాలన్నారు. ఆయా విషయాలను తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లేలా అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు కూడా గురువారం అవగాహన కల్పించాలని అధికారులకు చెప్పారు. ఈ సమావేశంలో డ్రైవ్ పర్యవేక్షకులుగా ఉన్న ఐదుగురు జిల్లాస్థాయి అధికారులైన జడ్పీ సీఈవో చిరంజీవి, మెప్మా పిడి నారాయణ, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, డ్వామా పిడి జోసఫ్ కుమార్, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్ తోపాటు డీఈవో రేణుక , ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, అసిస్టెంట్ కమిషనర్ నగేష్, హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, శానిటరీ సూపర్వైజర్ పిచ్చయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెళ్లి నెపంతో మోసం, అక్రమ గర్భస్రావం: చికిత్స పొందుతూ బాధితురాలు మృతి... నిందితుడి అరెస్ట్

వార్త సంధ్య కూకట్పల్లి :
పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడమే కాకుండా, గర్భవతి అయిన యువతికి బలవంతంగా అబార్షన్ మాత్రలు ఇచ్చి ఆమె మృతికి కారణమైన ఘటనలో ఓ యువకుడిని కేపీహెచ్బీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆర్.టి.సి కాలనీ ప్రాంతానికి చెందిన అరేపు నాగసాయి (26) అనే సౌండ్ ఇంజనీర్, తనకిదివరకే వివాహమైన విషయాన్ని దాచిపెట్టి 30 ఏళ్ల ఒక మహిళతో సన్నిహితంగా మెలిగాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో సదరు మహిళ గర్భం దాల్చడంతో, నిందితుడు ఆమెకు తెలియజేయకుండానే గర్భస్రావానికి (అబార్షన్) ఉపయోగించే మాత్రలు ఇచ్చాడు.మాత్రలు మింగిన అనంతరం తీవ్ర రక్తస్రావం, పొత్తికడుపు నొప్పితో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో బాధితురాలిని కుటుంబ సభ్యులు వెంటనే కేపీహెచ్బీలోని హోలిస్టిక్ ఆసుపత్రి ఐసీయూ లో చేర్పించారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేపీహెచ్బీ పోలీసులు క్రైమ్ నంబర్ 1096/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్లు 69, 89 కింద కేసు నమోదు చేశారు.సాక్ష్యాధారాల ఆధారంగా సెప్టెంబర్ 09, 2026న నిందితుడు నాగసాయిని పోలీసులు అదుపులోకి తీసుకుని



విచారించారు. కమ్యూనికేషన్ కోసం ఉపయోగించిన నిందితుడి వన్‌ప్లస్ మొబైల్ ఫోన్‌ను పంచనామా సమక్షంలో సీజ్ చేశారు. చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం నిందితుడికి వైద్య మరియు పొటెన్సీ పరీక్షలు నిర్వహించి, న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్కు తరలించారు.కె మెరుగైన చికిత్స కోసం బాధితురాలిని ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సెప్టెంబర్ 14, 2026 సాయంత్రం 19:00 గంటల ప్రాంతంలో ఆమె తుదిశ్వాస విడిచింది.మహిళ మరణించడంతో పోలీసులు కేసును మరింత తీవ్రంగా పరిగణించి, బీఎన్ఎస్ సెక్షన్ 89ను సెక్షన్ 90(2) బీ ఎన్ ఎస్ గా మార్పు చేశారు. ఈ ఘటనపై కేపీహెచ్బీ పోలీసులు సమగ్ర విచారణ కొనసాగిస్తున్నారు. చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

కోర్టుల్లో ఎండుతున్న సామాన్యుల గొంతులు!

-న్యాయం కోసం గంటల తరబడి నిరీక్షణ.. దాహం తీర్చుకునేందుకు నీరు కరువు

-కూర్చునేందుకు బెంచీలు లేక అవస్థలు.. వృద్ధులు, మహిళలు, పిల్లలకు మరింత ఇబ్బందులు

-ప్రజల ఆరోగ్యం, సౌకర్యాలపై న్యాయస్థానాల పరిపాలనా విభాగాలు దృష్టి సారించాల్సిన సమయం







హైదరాబాద్స్ (వార్త సంధ్య)సెప్టెంబర్ 16.
న్యాయం కోసం న్యాయస్థానాల గడప తొక్కే సామాన్య ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు అందుతున్నాయా? కోర్టు ప్రాంగణాల్లో గంటల తరబడి వేచి ఉండే ప్రజలకు తాగునీరు, కూర్చునేందుకు సరిపడా బెంచీలు అందుబాటులో ఉన్నాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. న్యాయం కోసం కోర్టుకు వచ్చే ప్రజలు తమ కేసు ఎప్పుడు విచారణకు వస్తుందో తెలియక గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఈ నిరీక్షణకు తోడు దాహం తీర్చుకునేందుకు తగినంత తాగునీరు లేకపోవడం, కూర్చునేందుకు సరిపడా బెంచీలు లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉదయం వస్తే.. సాయంత్రం వరకు నిరీక్షణ

కోర్టు కేసుల విషయంలో సమయం ఎంత పడుతుందో ముందుగా అంచనా వేయడం చాలాసార్లు కష్టమే. కేసు జాబితాలో ఉన్నప్పటికీ విచారణ సమయం మారవచ్చు. కేసు వాయిదా పడవచ్చు. ఇతర కేసుల విచారణ కొనసాగడం వల్ల తమ కేసు కోసం మరికొంత సమయం వేచి ఉండాల్సి రావచ్చు.
దీంతో ఉదయం కోర్టుకు వచ్చిన వ్యక్తి మధ్యాహ్నం దాటినా, కొన్నిసార్లు సాయంత్రం వరకు అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే కక్షిదారులు, వారి కుటుంబ సభ్యులు, సాక్షులు, న్యాయపరమైన ప్రక్రియ కోసం హాజరయ్యే ఇతరులు ఈ నిరీక్షణను తప్పించుకోలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు.
ఇంతటి సుదీర్ఘ నిరీక్షణ సమయంలో ప్రజలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండటం అత్యంత అవసరం.

దాహం వేస్తే.. నీటి కోసం బయటకు!

కోర్టు ప్రాంగణంలో తగిన తాగునీటి సౌకర్యం అందుబాటులో లేకపోతే ప్రజలు బయటకు వెళ్లి నీరు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు చెబుతున్నారు. కేసు ఎప్పుడు పిలుస్తారో తెలియని సమయంలో బయటకు వెళ్లడం కూడా కొంతమందికి ఇబ్బందికరంగా మారుతోంది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలతో వచ్చే కుటుంబాలు, శారీరక ఇబ్బందులు ఉన్న వ్యక్తులకు ఈ సమస్య మరింత తీవ్రంగా అనిపిస్తోంది.
ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో శుద్ధమైన తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేసేలా పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

కూర్చోవడానికి బెంచీలు ఎక్కడ?

తాగునీటి సమస్యతో పాటు మరో ముఖ్యమైన సమస్య సీటింగ్ సౌకర్యం. కోర్టు ప్రాంగణానికి వచ్చే ప్రజల సంఖ్యకు అనుగుణంగా బెంచీలు అందుబాటులో లేకపోతే గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కేసు విచారణ కోసం వచ్చిన ప్రతి ఒక్కరూ ఒకే వయసు, ఒకే శారీరక సామర్థ్యం కలిగిన వారు కాదు. వృద్ధులు, గర్భిణీలు, మహిళలు, చిన్నపిల్లలతో వచ్చే వారు, అనారోగ్యంతో ఉన్నవారు ఎక్కువసేపు నిలబడటం ఇబ్బందికరంగా ఉంటుంది.
కేసు పిలుపు కోసం వేచి ఉండే సమయంలో కూర్చునేందుకు సరిపడా బెంచీలు ఉంటే ప్రజలకు కొంత ఉపశమనం లభిస్తుంది. అందుకే కోర్టు ప్రాంగణంలో ప్రతిరోజూ వచ్చే ప్రజల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని సీటింగ్ సామర్థ్యాన్ని పెంచాలని ప్రజలు కోరుతున్నారు.
న్యాయం కోసం వచ్చిన వారికి కనీస సౌకర్యాలు ఎందుకు ఉండకూడదు?
కోర్టు అంటే కేవలం కేసుల విచారణ జరిగే ప్రదేశం మాత్రమే కాదు. ప్రజలు తమ హక్కుల కోసం, న్యాయం కోసం వచ్చే ప్రజా ప్రదేశం కూడా. అందువల్ల అక్కడికి వచ్చే ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండటం అవసరం.
తాగునీరు, బెంచీలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, నీడ, వృద్ధులు మరియు దివ్యాంగులకు అనుకూలమైన సదుపాయాలు వంటి అంశాలపై సంబంధిత పరిపాలనా విభాగాలు నిరంతరం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.
ఏదైనా సౌకర్యం ఏర్పాటు చేసినా అది పనిచేస్తుందా? పరిశుభ్రంగా ఉందా? ప్రజలకు వాస్తవంగా ఉపయోగపడుతోందా? అనే అంశాలపై కూడా క్రమం తప్పకుండా తనిఖీలు జరగాలి.

ఒకసారి అధికారులు పరిశీలిస్తే..!

కోర్టు ప్రాంగణాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు ఎలా గడుపుతున్నారో సంబంధిత అధికారులు ఒకసారి ప్రత్యక్షంగా పరిశీలిస్తే సమస్య తీవ్రత స్పష్టంగా అర్థమవుతుందని ప్రజలు అంటున్నారు. ఎన్ని బెంచీలు ఉన్నాయి? రోజుకు ఎంతమంది ప్రజలు వస్తున్నారు? అందుబాటులో ఉన్న తాగునీటి కేంద్రాలు ఎన్ని? వాటిలో ఎన్ని పనిచేస్తున్నాయి? వేసవిలో నీటి సరఫరా పరిస్థితి ఏమిటి? వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయా? వంటి అంశాలపై సమీక్ష జరగాల్సిన అవసరం ఉంది. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చే వరకు వేచి ఉండకుండా, ముందుగానే సౌకర్యాల లోపాలను గుర్తించి పరిష్కరించే విధానం ఉంటే మరింత ప్రయోజనం కలుగుతుంది.

న్యాయస్థానాలపై ప్రజల విశ్వాసం.. సౌకర్యాలతోనూ ముడిపడి ఉంది

న్యాయం కోసం కోర్టుకు వచ్చే సామాన్యుడు ఇప్పటికే తన సమస్యతో ఇబ్బందుల్లో ఉంటాడు. కేసు ప్రక్రియలో గంటల తరబడి వేచి ఉండటం ఒకవైపు.. ఆ సమయంలో కనీస సౌకర్యాలు లేకపోవడం మరోవైపు ఉంటే అతని ఇబ్బంది మరింత పెరుగుతుంది. అందుకే కోర్టు ప్రాంగణాల్లో ప్రజలకు అవసరమైన తాగునీరు, సీటింగ్ సౌకర్యాలను ప్రాథమిక అవసరాలుగా పరిగణించి మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు. న్యాయం కోసం వచ్చే సామాన్యుడికి న్యాయం అందే ప్రక్రియతో పాటు.. ఆ న్యాయం కోసం వేచి ఉండే సమయంలో కనీస మానవీయ సౌకర్యాలు కూడా అందాలి. కోర్టు గడప తొక్కిన ప్రతి పౌరుడు గౌరవంగా, కనీస ఇబ్బందులతో తన కేసు ప్రక్రియను పూర్తి చేసుకునే వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.
తాగునీరు కావాలి.. కూర్చునే చోటు కావాలి.. న్యాయం కోసం వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు కావాలి.
ఇది ఎవరినీ నిందించడానికి కాదు.. న్యాయం కోసం వచ్చే సామాన్య ప్రజల గొంతును సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే విజ్ఞప్తి.

-- వార్త సంధ్య ప్రత్యేక కథనం

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com

చరిత్రలో తొలిసారి.. మక్కా నగరానికి హై అలర్ట్ జారీ

దుబాయ్:
సౌదీ అరేబియాలోని పలు పట్టణాలకు హై అలర్ట్ జారీ చేశారు. వైమానిక దాడులు జరిగే అవకాశం ఉన్నట్లు తన హెచ్చరికల్లో సౌదీ సివిల్ డిఫెన్స్ పేర్కొన్నది. పశ్చిమ తీరంలో ఉన్న నగరాలకు ఆ హెచ్చరిక జారీ చేశారు. ముస్లింల పవిత్ర నగరం మక్కాకు కూడా హై అలర్ జారీ చేశారు. జెద్దా, టైఫ్ ప్రభుత్వాలు కూడా హై అలర్ట్ జారీ చేసి, ఆ తర్వాత హెచ్చరికలను ఎత్తివేశారు. మక్కా నగరానికి వైమానిక దాడి హెచ్చరికలు చేయడం చరిత్రలో ఇదే మొదటిసారి.ఇటీవల ఇరానీ మద్దతుతో హౌతీలు పదేపదే సౌదీని టార్గెట్ చేస్తున్న నేపథ్యంలో ఆ హెచ్చరికలు జారీ చేశారు. మదీనాలో ఉన్న ప్రిన్స్ మొహమ్మద్ బిన్ అబ్దుల్లిజ్ ఇంటర్నేషనల్ విమానాశ్రయానికి సర్వీసులను బంద్ చేశారు.



యెమెన్ నుంచి హౌతీ మిలిటెంట్లు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేయడం వల్ల సౌదీలో 13 మంది గాయపడ్డారు. ఏదైనా ఎమర్జెన్సీ ఉంటే 911కి ఫోన్ చేయాలని సౌదీ సివిల్ డిఫెన్స్ డైరెక్టరేట్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నది. మొత్తం ఆరు ప్రదేశాల్లో స్వల్ప సమయం పాటు ఎయిర్ రెయిడ్ అలర్ట్లు జారీ చేసినట్లు సౌదీ రక్షణ శాఖ చెప్పింది. ఈ మధ్య కాలంలో హౌతీలు చేసిన దాడిలో సౌదీ అరేబియాలోని పలు ఆయిల్ కేంద్రాలు అంటుకున్నాయి. ఆ దాడుల్లో 73 మంది గాయపడ్డారు. యెమెన్లోని సౌదీ మద్దతు దళాలను కూడా హౌతీలు టార్గెట్ చేస్తున్నారు. సోమవారం జరిగిన దాడిలో 8 మంది సైనికులు మృతిచెందారు. ఎర్ర సముద్రంలోని నౌకలను కూడా హౌతీలు టార్గెట్ చేస్తున్నారు.

అరేబియా సముద్ర జలాల్లో ఢీకొన్న పాక్, భారత నౌకలు



న్యూఢిల్లీ:
అంతర్జాతీయ సముద్ర జలాల్లో ఇండో, పాక్ నౌకలు ఢీకొన్నాయి . ఈ ఘటనపై భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. పాకిస్థాన్ నౌకాదళ వ్యవహారం ఆమోదయోగ్యంగా లేదని, దాని ప్రవర్తన ప్రొఫెషనల్గా లేదని భారత్ పేర్కొన్నది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ దౌత్యవేత్తకు భారత్ సమన్లు జారీ చేసింది. భారతీయ నేవీ నౌకను పాక్ నేవీ నౌక ఢీకొన్నట్లు విదేశాంగ వర్గాలు తెలిపాయి. ఈ ఘటన అంతర్జాతీయ జలాల్లో జరిగినా, భారతీయ నౌకకు డ్యామేజ్ జరగలేదని, కానీ పాకిస్థాన్ నౌకాదళ ప్రవర్తన సరిగా లేదని భారత్ పేర్కొన్నది.1991 నాటి నౌకావిన్యాసాల అగ్రిమెంట్లోని ఆర్టికల్ 10 ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లు అవుతుందని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకనలో తెలిపింది. గత రాత్రి అరేబియా సముద్రంలో ఈ ఘటన జరిగినట్లు విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. పాకిస్థానీ విదేశాంగ శాఖకు ఈ విషయాన్ని చేరవేసినట్లు భారత్ తెలిపింది. పాక్ మిలిటరీ యూనిట్లు అన్నీ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచన చేసినట్లు చెప్పారు. పాకిస్థాన్ విదేశాగ శాఖ ముందు నిరసన వ్యక్తం చేయాలని ఇస్లామాబాద్లోని భారత ఎంబసీకి చెప్పినట్లు భారత విదేశాంగ శాఖ పేర్కొన్నది.

పారాచూట్ శిక్షణలో ఆర్మీ శునకం



న్యూఢిల్లీ:
పోలీసుల జాగిలాలు ఎన్నో సందర్భాల్లో కీలక ఆపరేషన్స్లో పాల్గొన్నాయి. ఇక ఇప్పుడు ఆర్మీ శునకాలు ఏకంగా పారాచూట్ శిక్షణలో పాల్గొంటున్నాయి. ఏరియల్ ఆపరేషన్స్కు కూడా అవి సిద్ధం అవుతున్నాయి. సెంట్రల్ ఇండియాలోని బేహట్ డ్రాప్ జోన్లో ఓ ఆర్మీ పారాట్రూపర్ తన శునకంతో కలిసి విమానం నుంచి జంప్ చేశాడు. డాగ్ హ్యాండ్లర్ కూడా ఆ జంప్లో పాల్గొన్నాడు. పూర్తి స్థాయి కంబాట్ లోడ్తో జంప్ చేశారు.భారతీయ ఆర్మీ తొలిసారి సుశిక్షత శునకాలతో పారాచూట్ జంపింగ్ నిర్వహించింది. సైనికుడు, శునకం మధ్య అసాధారణా అనుబంధం ఏర్పడినట్లు సెంట్రల్ కమాండ్ తన పోస్టులో పేర్కొన్నది. అమెరికాలోని యూఎస్ నేవీ సీల్స్కు చెందిన దళాల్లో ఎయిర్బార్న్ ఆపరేషన్స్లో పాల్గొనే శునకాలు ఉన్నాయి. పాక్లోని ఒసామా బిన్ లాడెన్ను హతమార్చేందుకు ఆ శునకాన్ని వాడారు.

సీఎంను టార్గెట్ చేస్తూ ఏఐ వీడియో..

ఎమ్మెల్యే సోదరుడి అరెస్టు

బల్రాంపూర్
ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ను టార్గెట్ చేస్తూ ఏఐ ద్వారా అభ్యంతరకర రీతిలో వీడియో ను క్రియేట్ చేశారు. అయితే ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో సమాజ్వాదీ పార్టీ మాజీ ఎమ్మెల్యే జగ్రామ్ పాశ్వాన్ సోదరుడిని అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే సోదరుడు సంధూ పాశ్వాన్ను అదుపులోకి తీసుకున్నట్లు అదనపు ఎస్పీ విశాల్ పాండే పేర్కొన్నారు. సంధూ పాశ్వాన్ అకౌంట్ నుంచి ఆ వీడియోను పోస్టు చేసినట్లు గుర్తించారు. వీడియో ఘటనను సమోటోగా తీసుకుని, దేహత్ కోత్వాల్ పోలీసు స్టేషన్ కేసు బుక్ చేసినట్లు ఆయన చెప్ఆపరు. పాశ్వాన్ను అరెస్టు చేశామని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ పేర్కొన్నారు. అలాంటి కాంటెంట్ వల్ల సమాజంలో సామరస్యత దెబ్బతింటుందని, కుల విద్వేషాలకు దారి తీసే అభ్యంతరకర వీడియోలు అప్లోడ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పాండే హెచ్చరించారు. ఆన్లైన్లో జరుగుతున్న ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలను తమ సోషల్ మీడియా మానిటరింగ్ బృందం నిత్యం పర్యవేక్షిస్తోందన్నారు. అభ్యంతరకర పోస్టులను అప్లోడ్ చేయడం కానీ, షేరింగ్ చేయడం కానీ మానుకోవాలని ఆయన ప్రజల్ని కోరారు.



ఉగ్రవాద సంస్థగా షెహ్జాద్ భట్టీ నెట్వర్క్



న్యూఢిల్లీ
షెహ్జాద్ భట్టీ నెట్వర్క్ను ఉపా చట్టం కింద భారత్ బుధవారం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. సరిహద్దుల్లో ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మత్తు మందులను అక్రమ రవాణా చేయడం, నిర్భాగ్యులను ఉగ్రవాదంలోకి చేర్చుకోవడం,భారత ప్రజాస్వామ్య నిర్మాణం, సామాజిక సామరస్యతపై దాడి చేస్తున్నారనే కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నది.

ఆర్మీ శునకం పారాచూట్ జంప్

సైన్యం చరిత్రలోనే మొదటిసారి



న్యూఢిల్లీ
ఆర్మీ శునకాలు ఇప్పటికే సైన్యంలో అనేక ధైర్య సాహసాలు కనబరుస్తున్నాయి. ఇప్పుడు ఏరియల్ ఆపరేషన్లో పాల్గొనేందుకు కూడా సిద్ధం అవుతున్నాయి. ఇందులో భాగంగా ఆర్మీ చరిత్రలోనే మొదటిసారి ఓ కాంబాట్ డాగ్ పారాచూట్ జంప్ చేసింది. సెంట్రల్ ఇండియాలోని బేహట్ డ్రాప్ జోన్ వద్ద సూర్య కమాండ్లోని ఓ పారాట్రూపర్, ఒక డాగ్ హ్యాండ్లర్ తన కాంబాట్ డాగ్ కలిసి పూర్తి స్థాయి యుద్ధ సామగ్రితో గాల్లో విమానం నుంచి జంప్ చేశారు. దీనిపై సూర్య కమాండ్ పోస్టు చేస్తూ.. భారత సైన్యంలో మరో ముందడుగు పడబోతున్నదని రాసుకొచ్చింది. ఒక సైనికుడు, శిక్షణ పొందిన శునకానికి ఉన్న అనుబంధంతో పాటు నమ్మకం ఇందులో కనబరిచారని పోస్టులో పేర్కొన్నది. ధైర్యం, కచ్చితత్వం, యుద్ధ నైపుణ్యాలను పెంచడంలో భాగంగా శునకాలకు ఇలాంటి శిక్షణలు మరిన్ని ఇవ్వబోతున్నట్టు సూర్య కమాండ్ అధికారులు వెల్లడించారు.

10 మంది నక్సల్స్కు మరణ శిక్ష

ఛత్తీస్గఢ్ ధీరాం ఘాటీ కేసులో ఎన్ఐఏ కోర్టు తీర్పు



రాయ్పూర్, సెప్టెంబర్ 16
ఛత్తీస్గఢ్లో సంచలనం సృష్టించిన ధీరాం ఘాటీ మారణకాండ కేసులో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు 10 మంది మావోయిస్టులకు మరణ శిక్ష విధించింది. ఈ కేసులోని నిందితులందరికీ మరణశిక్ష విధిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ సింగ్ రాజ్పుట్ బుధవారం తీర్పు చెప్పారు. నిందితులు ప్రస్తుతం జగదల్పూర్ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. 2013 మే 25న ఛత్తీస్గఢ్లో కాంగ్రెస్ నిర్వహిస్తున్న పరివర్తన్ యాత్ర వాహనాల కాన్వాయ్ పై సీపీఐ (మావోయిస్టు) సాయుధ కార్యకర్తలు మారణాయుధాలతో దాడి చేయగా, 30 మంది మరణించారు. వారిలో 10 మంది పోలీసులు ఉన్నారు. 38 మంది గాయపడ్డారు. మృతుల్లో గిరిజన నేత మహేంద్ర కర్మ, అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నంద్ కుమార్ పటేల్, కేంద్ర మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా కూడా ఉన్నారు.

విధులకు వెళ్లకుండా రూ.70,000 వేతనం

-ఉద్యోగం నుంచి కర్ణాటక ఎమ్మెల్యే మేనకోడలు తొలగింపు



బెంగళూరు, సెప్టెంబర్ 16
నిబంధనలకు విరుద్ధంగా వైద్య అధికారిణిగా పనిచేస్తున్న కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే మేనకోడలును అధికారులు విధుల నుంచి తప్పించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉమేశ్ మేతి మేనకోడలు అంకిత యరగల్ బాగల్కోట్లో ప్రభుత్వ నమ్మల్ క్లినిక్లో కొన్ని నెలల నుంచి మెడికల్ ఆఫీసర్గా పనిచేస్తూ రూ.70 వేలకు పైగా జీతాన్ని పొందుతున్నారు. ఈ ఏడాది మార్చి నుంచి అమె విధులకు గైర్హా జర్ కావడంతో, విచారించగా, ఆమె ఒక ప్రైవేట్ వైద్య కళాశాలలో పీజీ విద్య అభ్యసిస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వ దవాఖాన నుంచి జీతం తీసుకుంటూ వేరేచోట చదవడం నిబంధనలకు విరుద్ధం కావడంతో ఆమెకు నోటీస్ జారీ చేసి బుధవారం విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. అయితే ఆమె హాజరుకాలేదు. దీంతో ఆమె ను వైద్యాధికారిగా విధుల నుంచి తొలగిస్తూ జిల్లా ఆరోగ్య అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

యూపీఐపై మోదీ సర్కార్ యూటర్న్!

ఎండీఆర్ వసూలు చేయ బోమని ఏడాది క్రితం ప్రకటనలు

నాటి మాటలు గుర్తు చేసిన సోషల్ మీడియా యూజర్లు




న్యూఢిల్లీ,
ఏడాదిన్నర లోపలే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మాటమార్చింది. యూపీఐ లావాదేవీలపై ప్రభుత్వం మర్చంట్ డిస్కౌంట్ రేట్(ఎండీఆర్) వసూలు చేయడానికి యోచిస్తున్నదన్న వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం, తప్పుదోవ పట్టించేవి అంటూ గత ఏడాది కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొన్న విషయాన్ని నగదు రహిత చెల్లింపు విధానంపై చార్జీలు విధించడం పట్ల ఆగ్రహంతో ఉన్న పలువురు సోషల్ మీడియా యూజర్లు బుధవారం గుర్తుచేశారు.యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ వసూలు చేయనున్నారనే ఊహాగానాలు, వాదనలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం, తప్పుదారి పట్టించేవి అని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ 2025 జూన్ 11న తన అధికారిక ఎక్స్ ఖాతాలో పేర్కొంది. ఇటువంటి నిరాధారమైన, సంచలనం సృష్టించే ఊహాగానాలు మన పౌరుల్లో అనవసరమైన అనిశ్చితిని, భయాన్ని, అనుమానాలను రేకెత్తిస్తాయి. యూపీఐ ద్వారా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది అని ఆర్థిక శాఖ ఆ పోస్ట్లో స్పష్టం చేసింది. ఈ విషయమై ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని ఎత్తిచూపుతూ బుధవారం ఆన్లైన్లోనే ఉన్న ఆ ట్వీట్ను యూజర్లు పలుమార్లు రీపోస్ట్ చేశారు. ప్రభుత్వం ఏదైనా చెబితే సాధారణంగా దానికి వ్యతిరేకమే నిజమవుతుందనడానికి ఇది మరో రుజువు. దీనికి దాదాపు ఒక సంవత్సరం పట్టింది అని ఇంటర్నెట్ స్వేచ్ఛా కార్యకర్త నిఖిల్ పహ్వా కామెంట్ చేశారు. కాగా, ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజావ్యతిరేక చర్యగా అభివర్ణించారు. పార్లమెంటరీ ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘం చైర్మన్ భర్తృహరి మహతాబ్ మాట్లాడుతూ ఎంపీలు ఈ అంశాన్ని లేవనెత్తారని, కమిటీ తదుపరి సమావేశంలో ఈ విషయాన్ని చర్చకు చేపడతామని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజా వ్యతిరేక చర్యగా కమిటీ సభ్యుడైన ఆర్ఎస్పీ ఎంపీ ఎన్కే ప్రేమ్చంద్రన్ పేర్కొన్నారు.

జపాన్లో లక్ష దాటిన శతాధిక వృద్ధులు



టోక్యో :
జపాన్లో తొలిసారిగా 100 అంతకన్నా ఎక్కువ వయస్సు గల పౌరుల సంఖ్య లక్ష దాటింది. దేశంలో సెప్టెంబర్ 1 నాటికి శతాధిక వృద్ధుల సంఖ్య 1,07,677కు చేరుకున్నట్లు ఆ దేశ ఆరోగ్య, కార్మిక సంక్షేమ శాఖ వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 7,914 ఎక్కువ. శతాధిక వృద్ధుల్లో మహిళలు 94,298 మంది ఉండగా, పురుషులు 13,779 మంది ఉన్నారు.

ఇజ్రాయెల్కు ట్రంప్ భారీ ఆయుధ ప్యాకేజీ



వాషింగ్టన్
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్కు 2.8 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 26,000 కోట్లు) విలువైన ఆయుధాలను అందించేందుకు సిద్ధమవుతోంది. ఈ ప్యాకేజీలో సుమారు 40,000 భారీ బాంబులు ఉండనున్నాయి.ఒక్కో బాంబు బరువు దాదాపు 900 కిలోలు. అయితే ఈ ఒప్పందం ఇంకా ఖరారు కాలేదు. 2024లో అప్పటి అధ్యక్షుడు జో బైడెన్ ప్రభుత్వం ఇజ్రాయెల్కు 2,000 బాంబుల సరఫరాను నిలిపివేసింది. గాజా వంటి జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఉపయోగిస్తే భారీగా ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందని బైడెన్ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది.

వార్త సంధ్య
vaarta sandhya
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com

విజయ్ సేతుపతి 'బత్తా' టీజర్ విడుదల..

- వింటేజ్ లుక్‌లో అదరగొట్టిన మక్కల్



కోలీవుడ్ స్టార్ హీరో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి నటిస్తున్న తాజా చిత్రం 'బత్తా'. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'నడువుల కొంచెం పక్కతా కానుమ్ను?', 'సీతకాతి' వంటి విభిన్న చిత్రాల తర్వాత విజయ్ సేతుపతి, దర్శకుడు బాలాజీ తరుణీధరన్ కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.పూర్తిగా 1960ల నాటి వింటేజ్ బ్యాక్‌డ్రాప్‌లో పీరియాడికల్ యాక్షన్ మరియు ఎమోషనల్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి సరసన 'జై భీమ్' ఫేమ్ లిజో మోల్ జోస్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ సినిమాకు సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, ఇటీవల విడుదలైన 'మగలే' అనే తండ్రీకూతుళ్ల భావోద్వేగ పాట ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రముఖ దర్శకుడు అట్లీ ఈ చిత్రాన్ని ప్రెజెంట్ చేస్తుండటం విశేషం. విజయ్ సేతుపతి వింటేజ్ లుక్‌లో బీడీ కాలుస్తూ చాలా డిఫరెంట్ స్టైల్‌లో కనిపిస్తున్న ఈ సినిమా టీజర్ సినిమాపై క్యూరియాసిటీని పెంచేసింది. ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు.

మైథలాజికల్ మూవీలో తమన్నా.. ఆసక్తికరంగా 'ది వాన్' ట్రైలర్



స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా హీరో సిద్ధార్థ్ మల్హోత్ర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ది వాన్'. మిస్టరీ, హారర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రానికి దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు బాలాజీ మోషన్ పిక్చర్స్ మరియు టీవీఎఫ్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, అరుణాభ్ కుమార్, మరియు నీరజ్ కొఠారి ఈ చిత్రానికి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.ట్రైలర్ గమనిస్తే.. ఇది కేవలం సాధారణ హారర్ సినిమా కాకుండా, పురాతన నమ్మకాలు మరియు దైవిక శక్తుల ఆధారంగా సాగే ఒక విభిన్నమైన ఫాంటసీ థ్రిల్లర్‌గా కనిపిస్తోంది. ఒక ఆధునిక భావాలున్న పట్టణ యువకుడు (సిద్ధార్థ్ మల్హోత్రా) తన పూర్వీకుల గ్రామంలోని ప్రవేశ నిషేధమున్న ఒక రహస్య అడవిలోకి ప్రవేశించి, అక్కడ ఒక దివ్యమైన శక్తిని లేదా అదృశ్య రూపాన్ని మేల్కొలపడం వంటి అంశాల చుట్టూ కథ తిరుగుతుంది. దీనివల్ల వారు ఎదుర్కొనే ఊహించని భయానక పరిణామాలు, ప్రమాదకర పరిస్థితులు ఏంటి అనేది ఈ సినిమా కథ. సినిమాలో తమన్నా పాత్ర అత్యంత కీలకమైందిగా తెలుస్తోంది. ఈ చిత్రంలో సునీల్ గ్రోవర్, మనీష్ పాల్, శ్వేతా తివారీ, అనుప్ సోని తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. భారీ విజువల్స్, ఉత్కంఠభరితమైన మలుపులతో వస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది

వరుస విజయాలతో బాక్సాఫీస్ క్వీన్‌గా మమిత బైజు..

ఏడాదిలోపే రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం!



మలయాళ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చి అతి తక్కువ కాలంలోనే టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా సౌత్ ఇండియా అంతటా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటీమణులలో మమిత బైజు ఒకరు. గడిచిన ఏడాది కాలంలో ఆమె నటించిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద వరుస విజయాలను నమోదు చేయడమే కాకుండా, ఏకంగా రూ. 1000 కోట్ల కలెక్షన్ల మార్క్‌ను దాటడం విశేషం. కేవలం సహజమైన నటనతోనే కాకుండా తనదైన ప్రత్యేక శైలితో యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటున్న ఈ యంగ్ హీరోయిన్, ప్రస్తుతం సౌత్ సినిమా పరిశ్రమలో మోస్ట్ వాంటెడ్ నటిగా దూసుకుపోతున్నారు.కేరళలోని కొట్టాయంకు చెందిన మమిత బైజు 2016లో విడుదలైన 'పావడ' చిత్రంతో చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించినప్పటికీ, 'ప్రేమలు' సినిమా ఆమె కెరీర్‌ను పూర్తిగా మలుపు తిప్పింది. ఆ చిత్రంలోని 'రీను' పాత్రతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో కూడా ఆమె బలమైన స్థానం సంపాదించుకున్నారు. ఆ తర్వాత ఆమె నటించిన ప్రతి సినిమా బాక్సాఫీస్ వద్ద అఖండ విజయాన్ని సొంతం చేసుకోవడం గమనార్హం. ఇక గత ఏడాది కాలంలో మమిత బైజు నటించిన సినిమాల బాక్సాఫీస్ సునామీ చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. విజయ్ సరసన నటించిన సినిమా ఏకంగా రూ. 300 కోట్లకు పైగా వసూలు చేయగా, ప్రదీప్ రంగనాథన్‌తో చేసిన చిత్రం రూ. 100 కోట్లు రాబట్టింది. అలాగే సూర్య నటిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రం రూ. 260 కోట్లు, ధనుష్‌తో కలిసి నటించిన 'కర' సినిమా రూ. 55 కోట్లు సాధించాయి. మరోవైపు థియేటర్లలో దూసుకుపోతున్న 'బెట్లహోమ్ కుటుంబ యూనిట్' ఇప్పటికే రూ. 310 కోట్లకు పైగా వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. ఇలా కేవలం 12 నెలల వ్యవధిలోనే ఆమె నటించిన చిత్రాలు సుమారు రూ. 1000 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచాయి. ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేసి, ఎంతో ఆత్మవిశ్వాసంతో నటించడంలో మమిత బైజు దిట్ట. ఏ పాత్రను ఎంచుకున్నా దానికి పూర్తి న్యాయం చేయడం ఆమె ప్రత్యేకత. అందుకే రోజురోజుకూ ఆమెకు ఫ్యాన్ ఫాలోవర్స్ భారీగా పెరిగిపోతున్నారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న మమిత బైజు రాబోయే రోజుల్లో మరిన్ని అద్భుతమైన ప్రాజెక్ట్‌లతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు.

వారణాసి' కథలో అదే కీలకం!



మహేష్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'వారణాసి' సినిమాపై దేశవ్యాప్తంగా ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. టైమ్ ట్రావెల్, మైథాలజీ అంశాలను కలబోసి అడ్వెంచర్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో మహేశ్‌బాబు శివ భక్తుడు రుద్ర పాత్రలో కనిపించనున్నారు. రామాయణ కాలం నాటి ఘట్టాలు కథలో కీలకంగా ఉండబోతున్నాయి.తాజాగా ఈ సినిమా కథాంశం గురించి ఆసక్తికరమైన అప్‌డేట్ బయటికొచ్చింది. క్రీ.పూ 7000 సంవత్సరాల క్రితం మొదలయ్యే ఈ కథ వర్తమానం వరకు వివిధ కాలాల్లో పయనిస్తూ సాగుతుందని తెలిసింది. అయితే ఈ సినిమాలో టైమ్ ట్రావెల్‌కు ప్రత్యేకమైన మిషన్‌లాంటిది ఏదీ ఉండదని, కాలాన్ని దాటి వేల సంవత్సరాల చరిత్రలోకి కథానాయకుడు ఎలా వెళ్లాడనే అంశమే అత్యంత ప్రధానంగా ఉంటుందని చెబుతున్నారు. పురాణాలు, చరిత్ర, భవిష్యత్తును అనుసంధానించిన ఈ కథలో ప్రేక్షకుల్ని అబ్బురపరిచే అంశాలెన్నో ఉంటాయని సమాచారం. ప్రియాంకచోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు చిత్ర ప్రధాన తారాగణం.

తెలుగులో మరో బంపరాఫర్



అగ్ర కథానాయిక శ్రీలీలకు వరుసగా అవకాశాలైతే వస్తున్నాయి కానీ..విజయాలు మాత్రం వరించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ భామ తెలుగులో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అగ్ర హీరో బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కథానాయకుడిగా అరంగేట్రం చేయబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది.వశిష్ఠ దర్శకత్వం వహిస్తారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నాయి. త్వరలో లాంచ్ కానుంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో శ్రీలీలను కథానాయికగా ఖరారు చేశారని తెలిసింది. దక్షిణాదితో పాటు బాలీవుడ్ నుంచి పలువురు యువ నాయికల పేర్లను పరిశీలించిన చిత్రబృందం చివరకు శ్రీలీలను ఓకే చేశారని అంటున్నారు. ఈ విషయంలో త్వరలో అధికారిక ప్రకటన రానుంది. ప్రస్తుతం శ్రీలీల తమిళంలో ధనుష్ 'ఓం' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. అలాగే హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో ఓ రొమాంటిక్ చిత్రంలో నటించనుంది.

ప్యారడైజ్ బిర్యానీలా అద్భుతంగా ఉంటుంది



'నేను ఇంత పెద్ద సినిమా ఎప్పుడూ చేయలేదు. దర్శకనిర్మాతలు నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని శాయశక్తుల కృషి చేశాను' అన్నారు సంపూర్ణేష్‌బాబు. నాని తాజా చిత్రం 'ది ప్యారడైజ్'లో బిర్యానీ అనే ఇంట్రెస్టింగ్ పాత్రలో కనిపించనున్నారు సంపూర్ణేష్‌బాబు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలకానుంది. ఈ సందర్భంగా శనివారం సంపూర్ణేష్‌బాబు విలేకరులతో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. ఈ సినిమాలో తాను నాని ఫ్రెండ్ క్యారెక్టర్‌లో కనిపిస్తానని, కథాగమనంలో తన పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని చెప్పారు.ఆయన మాట్లాడుతూ 'మూడు సంవత్సరాల క్రితం ఇలాంటి క్యారెక్టర్ వచ్చి ఉంటే నా కెరీర్‌లో కొన్ని మిస్టేక్స్ జరిగేవి కావు. నానిగారితో పనిచేయడం చాలా కంఫర్టబుల్‌గా అనిపించింది. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా' అన్నారు. ఈ సినిమా కోసం తాను బరువు తగ్గానని, జుట్టు..గడ్డం కూడా పెంచానని సంపూర్ణేష్‌బాబు పేర్కొన్నారు. ప్యారడైజ్ బిర్యానీ ఎంత అద్భుతంగా ఉంటుందో ఈ సినిమా అంతే అద్భుతంగా ఉంటుందని, రెమ్యునరేషన్ పరంగా కూడా చాలా హ్యాపీగా ఉన్నానని సంపూర్ణేష్‌బాబు తెలిపారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.